



చంద్రగిరి అభ్యర్థిగా నానిని ప్రకటించడంపై టీడీపీ శ్రేణుల ఉత్సాహ ర్యాలీ

ఎన్నికల పోరుకు టీడీపీ సిద్ధం

తాజాగా ఏడు స్థానాలకు అభ్యర్థుల ప్రకటన

ఇదివరకే తొమ్మిది సీట్లకు ఖరారు

పార్టీ శ్రేణుల్లో పెరిగిన జోష్

సత్యవేడులో మాత్రం పార్టీ వర్గాల్లో అసంతృప్తి



చంద్రగిరి

పూర్తి పేరు: పులివర్తి వెంకట మణిప్రసాద్ అలియాస్ నాని
పుట్టిన తేది: 21-5-1971
విద్యార్హత: డిగ్రీ
తల్లిదండ్రులు: లక్ష్మీభారతి, నాగరాజ నాయుడు
భార్య: పులివర్తి రాగసుధ
పిల్లలు: కుమారుడు వినీల్
స్వగ్రామం: పులివర్తివారిపల్లి, పాకాల మండలం
గతంలో పదవులు: సర్పంచ్, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం చిత్తూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడుగా కొనసాగుతున్నారు.



శ్రీకాళహస్తి

పూర్తి పేరు: బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి
పుట్టిన తేది: 22-5-1979
విద్యార్హత: ఎంబీఏ
తల్లిదండ్రులు: బృందమ్మ, బొజ్జల గోపాలకృష్ణారెడ్డి
భార్య: రిషిత
పిల్లలు: కుమార్తెలు అనిక, సమిక
స్వగ్రామం: ఊరందూరు, శ్రీకాళహస్తి మండలం



వెంకటగిరి

పూర్తి పేరు: కురుగొండ్ల లక్ష్మీ సాయిప్రియ
పుట్టిన తేది: 08-02-1994
విద్యార్హత: ఎమ్మెస్సీ
తల్లిదండ్రులు: సింధు, కురుగొండ్ల రామకృష్ణ
భర్త: శ్రీనివాస తేజ
పిల్లలు: కుమార్తె యామి
స్వగ్రామం: కమ్మవారిపల్లి, డక్కిలి మండలం



సత్యవేడు

పూర్తి పేరు: కోనేటి ఆదిమూలం
వయస్సు : 72 సంవత్సరాలు
విద్యార్హత : బీఏ
తల్లిదండ్రులు: కాంతమ్మ, ఏళుమలై
భార్య: గోవిందమ్మ
పిల్లలు : కుమారుడు సుమన్ కుమార్, కుమార్తెలు స్వప్న శోభ, శ్రావణి
స్వగ్రామం : భీముని చెరువు, నారాయణ వనం మండలం
గతంలో పదవులు: భీముని చెరువు సర్పంచ్‌గా మూడు సార్లు, నారాయణవనం వైస్ ఎంపీపీగా, జడ్పీటీసీగా ఒక్కో పర్యాయం పని చేశారు. టీడీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడిగా రెండు సార్లు, డీసీసీ కార్యదర్శిగా రెండు సార్లు పార్టీ పదవులను నిర్వహించారు. 2014లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. 2019లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

తిరుపతి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల షెడ్యూలు ప్రకటించక ముందే తెలుగుదేశం పార్టీ ఎన్నికల పోరుకు సిద్ధమైంది. తిరుపతి, ఉమ్మడి చిత్తూరు జిల్లాల పరిధిలో ఇదివరకే తొమ్మిది స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన టీడీపీ గురువారం మిగిలిన ఏడు స్థానాలకు కూడా అభ్యర్థులను వెల్లడించేసింది. మొత్తం 17 స్థానాలకు గానూ జనసేనకు కేటాయించిన తిరుపతి మినహా 16 సీట్లకూ అభ్యర్థులను ఖరారు చేసి ప్రకటించేయడంతో పార్టీ శ్రేణుల్లో ఫుల్ జోష్ నెలకొంది. తొలి జాబితాలో చోటు దక్కని నియోజకవర్గాల్లో మార్పులుంటాయోమోనని అనుమానంతో దిగాలు పడిన కార్యకర్తలకు తాజా ప్రకటనతో సందేహాలన్నీ పటాపంచలయ్యాయి. దీంతో వారు రెట్టించిన ఉత్సాహంతో ప్రచారంలోకి దూకుతున్నారు.

అభ్యర్థులు వీరే!

టీడీపీ అధినేత చంద్రబాబు గురువారం విడుదల చేసిన అభ్యర్థుల జాబితాలో మదనపల్లెకు మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా, పుంగనూరుకు చల్లా రామచంద్రారెడ్డి, పూతలపట్టుకు డాక్టర్ మురళీ మోహన్, చంద్రగిరికి పులివర్తి నానీ, సత్యవేడుకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, శ్రీకాళహస్తికి బొజ్జల సుధీర్‌రెడ్డి, వెంకటగిరికి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కుమార్తె లక్ష్మీ సాయి ప్రసన్న అభ్యర్థులుగా వున్నారు. తొలి జాబితాలో కుప్పం నుంచీ అధినేత చంద్రబాబు, తంబళ్లపల్లెకు జయచంద్రారెడ్డి, పలమనేరుకు మాజీ మంత్రి అమరనాథరెడ్డి, చిత్తూరుకు గురజాల జగన్మోహన్, జీడీనెల్లూరుకు డాక్టర్ థామస్, నగరికి గాలి భానుప్రకాష్ పేర్లు వెల్లడైన సంగతి తెలిసిందే. మొత్తానికీ తిరుపతి, ఉమ్మడి చిత్తూరు జిల్లాల పరిధిలో మొత్తం 17 అసెంబ్లీ స్థానాలుండగా జనసేనకు కేటాయించిన తిరుపతిని మినహాయిస్తే మిగిలిన 16 స్థానాలకూ అభ్యర్థులు ఖరారైపోయారు.

ఆరు స్థానాల్లో బలమైన అభ్యర్థులు

టీడీపీ రెండో జాబితాలో ఆరు నియోజకవర్గాలకు బలమైన నేతలను అభ్యర్థులుగా ప్రకటించింది. మదనపల్లెలో షాజహాన్ బాషా 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచీ ఎమ్మెల్యేగా గెలిచారు. 2014లో హేమాహేమీలైన నేతలంతా కాంగ్రెస్‌ను విడిచిపెట్టి వెళ్ళిపోగా ఆయన మాత్రం పార్టీనే అంటిపెట్టుకుని 2014, 2019 ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయినా పార్టీ ఉనికి కాపాడారు. గతేడాది ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. మైనారిటీ వర్గాల్లో గట్టి పట్టున్న షాజహాన్ బాషాకు మిగిలిన వర్గాల్లోనూ ఆదరణ వుంది. వ్యక్తిగతంగా మంచిపేరుంది. గత రెండు ఎన్నికల్లో ఓడిపోయిన కారణంగా సానుభూతి కూడా వుంది. వర్గ విభేదాల ప్రభావం ఇతడిపై పడే అవకాశాలు తక్కువ. ఇక పుంగనూరులో చల్లా రామచంద్రారెడ్డిది రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబం. టీడీపీ ఆవిర్భావం నుంచీ పార్టీలోనే కొనసాగుతోంది. తండ్రి రెండు సార్లు పీలేరు ఎమ్మెల్యేగా గెలిచారు. ఈయన 1989లో పీలేరు నుంచీ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై పోటీచేసి ఓటమి చెందారు. 35 ఏళ్ళ సుదీర్ఘ విరామం తర్వాత ఈసారి పుంగనూరు నుంచీ పెద్దిరెడ్డిపై మళ్ళీ పోటీకి దిగుతున్నారు. సొంత మండలం రొంపిచెర్లలో గట్టి పట్టున్న ఇతడికి నియోజకవర్గవ్యాప్తంగా వర్గం, విస్తృత పరిచయాలున్నాయి. జనంలో సానుభూతి కూడా వుంది. చంద్రగిరిలో పులివర్తి నానీ గత ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీ చేశారు. ఓటమిచెందినా నియోజకవర్గంలోనే వుంటూ కార్యకర్తలకు, నాయకులకు అండగా నిలిచారు. నిత్యం నియోజకవర్గంలో పర్యటిస్తూ అధికార పార్టీ నేతల అక్రమాలను, ఆగడాలను ఎదుర్కొంటున్నారు. ఈ ఐదేళ్ళలో పార్టీని బలోపేతం చేశారు. శ్రీకాళహస్తిలో బొజ్జల సుధీర్ కుటుంబ నేపథ్యం గురించి ప్రత్యేకంగా చెప్పక్కర లేదు. తాత, తండ్రులు ఎమ్మెల్యేలుగా పనిచేయగా తండ్రి మంత్రిగా కూడా వ్యవహరించారు. నియోజకవర్గ వ్యాప్తం గా బలమైన వర్గం, విస్తృత పరిచయాలున్నాయి. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందిన తర్వాత కొంతకాలం స్థానికంగా లేకపోయినా రెండేళ్ళుగా చురుగ్గా వున్నారు. నియోజకవర్గంలో పర్యటిస్తూ కార్యకర్తలకు అందుబాటులో వుంటున్నారు. వైసీపీ నేతల దౌర్జన్యాలను ఎదుర్కొంటూ శ్రేణులకు అండగా నిలిచారు. వెంకటగిరిలో కురుగొండ్ల లక్ష్మీ సాయిప్రసన్నది కూడా రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబమే. తండ్రి రామకృష్ణ రెండుసార్లు వెంకటగిరి ఎమ్మెల్యేగా పనిచేశారు. నిత్యం శ్రేణులు, ప్రజల మధ్యే వుంటూ మాస్ లీడర్‌గా పేరు పడ్డారాయన. తండ్రి మద్దతు ఆమెకు కొండంత బలం కానుంది. విద్యాధిక యువతి కావడంతో మహిళా వర్గానికి సులువుగా చేరువ కాగలరన్న అంచనా వుంది. ఇక పూతలపట్టులో డాక్టర్ మురళీమోహన్ గతేడాదే అభ్యర్థిగా ఖరారయ్యారు. అప్పటి నుంచే జనంలో వుంటున్న ఆయన నిత్యం గ్రామాల్లో పర్యటిస్తూ శ్రేణులను, ప్రజలను కలుసుకుంటున్నారు. ప్రత్యర్థి పార్టీ అభ్యర్థితో పోలిస్తే ప్రచారంలోనూ, జనంలోకి వెళ్ళడం లోనూ ఎంతో ముందుకు వెళ్ళిపోయారు. ఈ ఆరు స్థానాల సంగతి పక్కన పెడితే ఆదిమూలానికి సత్యవేడు టికెట్ ఇవ్వడం నియోజకవర్గ పార్టీ శ్రేణుల్లో అసంతృప్తిని రగిలించింది.ఆదిమూలం బలమైన అభ్యర్థే అయినా పార్టీ శ్రేణుల కోణంలో ఆయన వైసీపీ నుంచీ వచ్చిన వారు కావడంతో సంపూర్ణ మద్దతు దక్కడం అనుమానంగా మారుతోంది.

టీడీపీ శ్రేణుల సంబరాలు

తాజా ప్రకటనలో సత్యవేడు మినహా మదనపల్లె, పుంగనూరు, పూతలపట్టు, చంద్రగిరి, శ్రీకాళహస్తి, వెంకటగిరి నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. చంద్రగిరిలో ఆరు మండలాలకు చెందిన కార్యకర్తలు చంద్రగిరి బైపాస్ రోడ్డు ఫ్లైఓవర్ నుంచీ చంద్రబాబు స్వగ్రామమైన నారావారిపల్లి వరకూ భారీ ఎత్తున బైక్ ర్యాలీ జరిపారు.

శ్రీకాళహస్తిలో కూడా ఏపీ సీడ్స్ కూడలి నుంచీ ఎన్టీయార్ కూడలి వరకూ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి ఎన్టీయార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పుంగనూరులో ఎన్టీయార్ కూడలిలో భారీగా బాణాసంచా పేల్చారు. చౌడేపల్లి, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాల్లో కూడా పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. మదనపల్లెలో బెంగుళూరు బస్టాండు నుంచీ ప్రారంభమైన బైక్ ర్యాలీ ఎన్టీయార్ కూడలిలో ఎన్టీయార్ విగ్రహానికి పాలాభిషేకం చేసిన అనంతరం నీరుగట్టుపల్లి, గొల్లపల్లి, సీటీఎం రోడ్డుల మీదుగా తిరిగి బెంగుళూరు బస్టాండు చేరుకున్న కార్యకర్తలు సాయంత్రం నుంచీ రాత్రి 9 గంటల వరకూ కూడా భారీ ఎత్తున బాణాసంచా పేలుస్తూనే వున్నారు. పూతలపట్టులో కూడా పార్టీ శ్రేణులు బాణాసంచా పేల్చి ఆనందోత్సాహాలు వ్యక్తం చేశాయి. వెంకటగిరిలో అభ్యర్థి లక్ష్మీ సాయిప్రసన్న పోలేరమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చారు. సత్యవేడుకు సంబంధించి ఆదిమూలం సొంత మండలం నారాయణవనంలో ఆయన అనుచరులు సంబరాలు జరుపుకున్నారు.



దర్పణంలో జ్ఞానప్రసూనాంబ దర్శనం

అమ్మ అలక చూడతరమా!

● వైభవంగా ఆదిదంపతుల పల్లకిసేవ

శ్రీకాళహస్తి, మార్చి 14: శ్రీకాళహస్తీశ్వరుడి శివరాత్రి ఉత్సవాల్లో గురువారం పల్లకి సేవ వైభవంగా జరిగింది.గంగాదేవిని వివాహమాడాడని తెలిసి అలకబూనిన ఆదిశక్తిని బుజ్జగించేందుకు పరమశివుడు ప్రయత్నించడమే ఈ సేవలో ప్రధానాంశం. తొలుత ఆలయంలోని అలంకార మండపంలో ఉత్సవమూర్తులను అలంకరించి వాహన మండపం వద్ద పల్లకీలలో ఆశీనులను చేసి పురవీధుల్లో ఊరేగించారు. జ్ఞానప్రసూనాంబ దేవి పల్లకిలో ఆశీనురాలై ఎదురుగా వున్న దర్పణంలో భక్తులకు దర్శనమిచ్చారు. సౌందర్య లహరి అయిన ఆదిశక్తి అలకలోనూ అద్వితీయమైన తేజస్సుతో భక్తులకు దర్పణంలో దర్శనమిచ్చారు. కోలాట నృత్యాలు, నిప్పుతో విన్యాసాలు, డ్రమ్స్ వాయిద్యాలు, కేరళవాయిద్యాలు, బ్యాండు, వేషధారణలు, కీలుబొమ్మలు, ఆశ్వరదం, మహిషాసురమర్దిని రథం, మంగళ వాయిద్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. శివనామస్మరణతో చతుర్మాడ వీధులు మార్మోగాయి. ఆలయ చైర్మన్ శ్రీనివాసులు,ఈవో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.శివరాత్రి ఉత్సవాల్లో శుక్రవారం రాత్రి స్వామి, అమ్మవార్లకు ఏకాంత సేవ జరగనుంది. శివరాత్రి ఉత్సవాల సందర్భంగా రద్దు చేసిన ఆర్జిత సేవలు శనివారం నుంచి యథావిధిగా అందుబాటులోకి రానున్నాయి.



పల్లకి సేవలో అశేష భక్తజనం

తిరుపతి జేసీగా ధ్యానచంద్ర

● శాప్ ఎండీగా శుభం బన్సల్



తిరుపతి(కలెక్టరేట్), మార్చి 14: తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా హెచ్‌ఎం ధ్యానచంద్రను నియమితులయ్యారు.2017 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ధ్యానచంద్ర శాప్ ఎండీగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ జేసీగా పనిచేస్తున్న శుభం బన్సల్ ధ్యానచంద్ర స్థానానికి బదిలీ అయ్యారు. మూడు నెలల వ్యవధిలోనే బన్సల్ బదిలీ కావడం చర్చనీయాంశమైంది.





తిరుపతిలో సమావేశమైన టీడీపీ, జనసేన నేతలు

తిరుపతిలో ‘ఆరణి’ కుంపటి

కూటమి అభ్యర్థిపై భగ్గుమన్న జనసేన, టీడీపీ నేతలు

పవన్‌కు అయితే ఓకే... లేదంటే స్థానికులకే టికెట్ ఇవ్వాలి...బయటి వారికిస్తే పనిచేయం

జనసేన అధిష్ఠానానికి ఇరుపార్టీల అల్టిమేటం

తిరుపతి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తరపున తిరుపతి అసెంబ్లీ అభ్యర్థిగా జనసేన నుంచీ చిత్తూరు సిట్టింగ్ వైసీపీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేరు ఖరారు కావడంతో తిరుపతిలో టీడీపీ, జనసేన పార్టీల నేతలు భగ్గుమన్నారు. రెండు పార్టీల శ్రేణులు సైతం తీవ్ర నిరుత్సాహానికి లోనయ్యాయి.గురువారం మధ్యాహ్నం నగరంలోని ఒక హోటల్లో అత్యవసరంగా భేటీ అయిన ఇరు పార్టీల నాయకులూ ఈ అంశంపై వాడివేడిగా చర్చించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ తిరుపతిలో పవన్ కళ్యాణ్ పోటీ చేసినా, ఆయన ఎవరికి టికెట్ ఇచ్చినా క్షేత్రస్థాయిలో పనిచేయాల్సింది తామేనన్నారు. తిరుపతిలో పోటీ చేయడానికి పవన్ కళ్యాణ్‌ను ఆహ్వానించారు. ఆయన గెలుపుకోసం శాయశక్తులా కలసి పనిచేస్తామన్నారు. ఆయన కాకుంటే తిరుపతి నియోజకవర్గానికి చెందిన ఎవరికి టికెట్ ఇచ్చినా కష్టపడి గెలుపునకు కృషి చేస్తామన్నారు. అలా కాకుండా తిరుపతి స్థానికుల ఆత్మగౌరవం దెబ్బతీసేలా బయటి వ్యక్తిని అభ్యర్థిగా నిర్ణయిస్తే సహించేది లేదని తేల్చి చెప్పారు. తిరుపతి జనసేన అభ్యర్థిగా ఖరారైన ఆరణి శ్రీనివాసులు సాంకేతికంగా ఇప్పటికీ చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే అని, అధికార పార్టీలో ఎమ్మెల్యేగా వున్న వ్యక్తికి తిరుపతిలో ఎలా టికెట్ ఇచ్చారని ప్రశ్నించారు. చిత్తూరులో ఆరణి శ్రీనివాసులు అవినీతి, అక్రమాలపై చంద్రబాబు మొదలుకుని లోకేశ్ దాకా బహిరంగసభల్లో ఆరోపణలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తి గెలుపుకోసం ఇపుడు తామంతా కృషి చేయాలా అని ప్రశ్నించారు. అసలు చిత్తూరులో వైసీపీకే పనికిరాని వ్యక్తి తిరుపతిలో మనకెలా పనికొస్తాడని నిలదీశారు. చిత్తూరులో పనికిరాడనే కదా వైసీపీలో టికెట్ ఇవ్వంది అని ప్రశ్నించారు. జనసేనలో చేరినప్పటికీ శ్రీనివాసులుకు ఇప్పటికీ వైసీపీ ముఖ్యనేతలతో వ్యాపార సంబంధాలు కొనసాగుతూనే వున్నాయని ఆరోపించారు. అతడికోసం పనిచేసేది లేదంటూ మూకుమ్మడిగా తేల్చి చెప్పారు. తిరుపతి నుంచీ పోటీకి పవన్ కళ్యాణ్‌ను ఆహ్వానిస్తున్నామని, ఆయన కాకుంటే స్థానికులకే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానికేతరుడైన అరణి శ్రీనివాసులును కూటమి అభ్యర్థిగా ప్రచారం చేయనివ్వబోమని, అసలు తిరుపతిలోనే అడుగుపెట్టనివ్వబోమని హెచ్చరించారు. టీడీపీ, జనసేన పార్టీల అధిష్ఠానాలు తిరుపతి స్థానికుల ఆత్మగౌరవాన్ని అర్థం చేసుకుని అభ్యర్థి నిర్ణయాన్ని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీడీపీ ఆశావహుడు ఊకా విజయ్‌కుమార్, టీడీపీ ముఖ్య నేతలు ఆర్సీ మునికృష్ణ, మబ్బు దేవనారాయణ రెడ్డి, పులిగోరు మురళి, జేబీ శ్రీనివాస్, దంపూరి భాస్కర్ యాదవ్, పుష్పావతి యాదవ్, మహేష్ యాదవ్, ఆర్సీ శ్రీనివాసులు, కంకణాల రజనీకాంత్ నాయుడు, ఆనంద్ యాదవ్, జనసేన జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, నియోజకవర్గ ఇంచార్జి కిరణ్ రాయల్, ముఖ్య నేత రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తిరుపతిలో ఆరణి శ్రీనివాసులు గో బ్యాక్ అంటూ ఫ్లెక్సీలు

గోబ్యాక్ అంటూ ఫ్లెక్సీలు

తిరుపతిలోని పలు ప్రాంతాల్లో జనసేన అభ్యర్థి అరణి శ్రీనివాసులు గోబ్యాక్ అంటూ ఆయన ఫొటో ముద్రించిన ఫ్లెక్సీలు వెలిశాయి. ప్రధాన కూడళ్ళలో వీటిని జనసేన శ్రేణులే ఏర్పాటు చేయడం గమనార్హం.

నేడు ఆరణి తిరుపతి రాక

తిరుపతికి శుక్రవారం ఉదయం ఆరణి శ్రీనివాసులు రానున్నారు.8గంటలకు కపిలతీర్థంలోని సుబ్రమణ్య స్వామి ఆలయంలో పూజలు చేసి తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి చేరుకుని పూజలు చేసి టీడీపీ,జనసేన నేతలను కలవనున్నట్టు తెలిసింది. పలువురు టీడీపీ నేతలను ఫోన్లో సంప్రదించి శుక్రవారం నేరుగా కలిసి మాట్లాడతానని చెప్పినట్టు తెలిసింది.నిజానికి శుక్రవారం తిరుపతిలో స్థానికుల ఆత్మగౌరవ సమావేశం నిర్వహించి, రెండు పార్టీల అధిష్ఠానాలకూ స్థానికుడినే అభ్యర్థిగా నిరణయించమని కోరుతూ స్పష్టమైన సందేశం ఇచ్చేందుకు టీడీపీ, జనసేన నేతలు నిర్ణయించారు.అయితే గురువారం రాత్రి పార్టీల అధిష్ఠానాల నుంచి వచ్చిన సూచనలతో ఈ సమావేశాన్ని వాయిదా వేసుకున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్రవారం) : 6.32
సహరి (శనివారం) : 5.02

జాతీయ సైన్స్ సదస్సుకు కమ్మపల్లి విద్యార్థిని



వాణిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రామచంద్రాపురం, మార్చి 14: కమ్మపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వాణి జాతీయ సైన్స్ సదస్సుకు ఎంపికైనట్లు ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు మోహన్ తెలిపారు. కొబ్బరి బొండాలను కత్తితో కాకుండా డ్రిల్లర్-బ్రేకర్ సాయంతో సులభంగా అరందాలు చేసే పరికరాన్ని రూపొందించిన విద్యార్థిని వాణిని, గైడ్ టీచర్ కామేశ్వరిని గురువారం ఆయన సన్మానించారు.ఉపాధ్యాయులు జయమ్మ, శోభారాణి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తలకోనలో మహా మండప నిర్మాణానికి భూమి పూజ



ఎర్రావారిపాలెం, మార్చి 14: తలకోన సిద్ధేశ్వర స్వామి ప్రధాన ఆలయ ముఖద్వారం ముందు మహా మండప నిర్మాణానికి గురువారం ఆలయ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో భూమి పూజ జరిగింది. మహామండప నిర్మాణానికి రూ.96 లక్షలు మంజూరు చేస్తూ దేవదాయ శాఖ రెండు రోజులక్రితం ఆదేశాలు జారీ చేసింది.ఈవో జయకుమార్, ప్రధాన అర్చకులు ప్రసన్నకుమార్, ధర్మకర్త మండలి సభ్యులు నాగిరెడ్డి, మంజుల, సురేష్, మధుసూదన్ శెట్టి, గంగోజీ, జయంత్, రాజేశ్వరి, గీత పాల్గొన్నారు.

400 మొబైల్ ఫోన్ల రికవరీ...



మొబైల్స్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

తిరుపతి (నేరవిభాగం), మార్చి 14 : తిరుపతి జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల్లో అపహరణకు గురైన దాదాపు రూ.72 లక్షల విలువ చేసే 400 మొబైల్ ఫోన్లను పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్ తన ఛాంబర్‌లో వాటిని బాధితులకు అందజేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏడాది కాలంలో 8 విడతల్లో 2,630 సెల్ ఫోన్లను రికవరీ చేసినట్లు చెప్పారు. ఫోన్లను రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్, సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు వెంకట్రావు, డీఎస్పీ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

చంద్రగిరి

ఈతకు వెళ్లి బాలుడి మృతి



ముని నిరంజన్ (ఫైల్ ఫొటో)

భాకరాపేట, మార్చి 14: చెరువులో ఈతకు వెళ్లిన బాలుడు మృతి చెందినట్లు తిరుపతి వెస్ట్ స్టేషన్ ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. రేణిగుంట బుగ్గవీధికకు చెందిన కె.ముని నిరంజన్(10) తిరుపతి ఎస్వీ బాలమందిరం పాఠశాలలలో 4వ తరగతి చదువుతున్నాడు. అదే పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న సతీశ్‌తో కలిసి భాకరాపేట పక్కన ఉన్న నల్లపురెడ్డిగారిపల్లెకు బుధవారం వచ్చాడు. ఇంటి వద్ద ఎవరూ లేకపోవడంతో పక్కనే ఉన్న పేట చెరువులో ఈతకు వెళ్లారు. ముందుగా ముని నిరంజన్ నీటిలో దిగి పైకి రాలేదు. ఇది గమనించిన సతీశ్ వెనక్కు వచ్చి ఎవరికీ చెప్పకుండా మిన్నకుండిపోయాడు. సాయంత్రం ముని నిరంజన్ ఇంటికి రాకపోవడంతో తల్లి స్వాతి సతీష్‌ను ఆరా తీసింది. భాకరాపేటలో బస్సు ఎక్కి వచ్చేశాడని చెప్పాడు. తర్వాత వెతికినా కనిపించకపోవడంతో స్వాతి వెస్ట్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు సతీశ్‌ను పిలిపించి విచారించారు. ముని నిరంజన్ నీటిలో మునిగిపోయినట్లు పోలీసులకు చెప్పాడు. రాత్రి కావడంతో గురువారం ఉదయం పోలీసులు అగ్నిమాపక సిబ్బందితో గాలించారు. బురదలో కూరుకుపోయిన ముని నిరంజన్ మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నగదు భక్తురాలికి అప్పగింత

తిరుచానూరు, మార్చి 14: శ్రీపద్మావతి అమ్మవారి దర్శనానికి వచ్చి పోగొట్టుకున్న నగదును భక్తురాలికి ఆలయ అధికారులు భద్రంగా అప్పగించారు. కర్ణాటకు రాష్ట్రం చిత్రదుర్గకు చెందిన కామాక్షి కుటుంబసభ్యులు గురువారం అమ్మవారి దర్శనానికి వచ్చారు. ఆలయంలో అమ్మవారి దర్శనానికి వెళ్లే క్రమంలో క్యూలైన్‌లో హ్యాండ్‌బ్యాగ్ పడిపోయింది. గుర్తించిన ఆలయ సెక్యూరిటీ హ్యాండ్‌బ్యాగ్‌లోని గుర్తింపు కార్డు ఆధారంగా భక్తురాలిని పిలిపించి పర్సులో ఉన్న రూ.35వేలు నగదుతో పాటు అందజేశారు. ఆలయ సెక్యూరిటీ సెక్యూరిటీ సిబ్బందిని సూపరింటెండెంట్ మధు అభినందించారు.

రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు

రామచంద్రాపురం, మార్చి 14: మండలంలోని బొప్పరాజపల్లె, సత్రంమిట్ట, నేతిగుంటపల్లి, బీరమాకులపల్లె, నెమళ్లగుంటపల్లె, అనుపల్లి, రేతలచేను, గోకులాపురం, ఉప్పిలివంక గ్రామాల్లో ప్రభుత్వం, తుడా నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను గురువారం ఎంపీపీ బ్రహ్మానందరెడ్డితో కలిసి చెవిరెడ్డి ధ్యానేష్ ప్రారంభించారు. జడ్పీటీసీ ఢిల్లీరాణి, భాను కుమార్ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, గోవర్ధన్, దేవరాజులరెడ్డి పాల్గొన్నారు.

రవాణా శాఖలో సర్వర్ సమస్య

● సేవలకు అంతరాయం

తిరుపతి (రవాణా), మార్చి 14: రవాణా శాఖ(ఆర్టీఏ)లో సర్వర్ సమస్యతో సేవలకు అంతరాయం ఏర్పడుతోంది. దేశం మొత్తం రవాణా శాఖలో ఒకే సాఫ్ట్‌వేర్‌ను వినియోగించాలన్న కారణంతో నూతన సాఫ్ట్‌వేర్‌ను అప్‌లోడ్ చేస్తున్నారు. వాహనదారులకు సంబంధించిన పూర్తి డేటాను ఆ సాఫ్ట్‌వేర్‌కు మారుస్తుండటంతో సర్వర్ సమస్య ఉత్పన్నమవుతోంది. తద్వారా ఎల్ఎల్ఆర్, డీఎల్, ఇతర సేవల కోసం ఆర్టీఏ కార్యాలయానికి వచ్చే వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్ని సందర్భాల్లో సర్వర్ పూర్తిగా పనిచేయకపోవడంతో స్లాట్‌బుక్ చేసుకున్న రోజున కాకుండా మరుసటి రోజున రావాల్సి వస్తుండడంపై వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీఏలోనే కాకుండా అనుబంధంగా పనిచేస్తున్న కామన్ సర్వీస్ సెంటర్లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. సర్వర్ అందుబాటులో ఉంటేనే అక్కడ కూడా సేవలు అందించడానికి వీలవుతుంది. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని వాహనదారులు కోరుతున్నారు.

కృష్ణకాంతషడంగీకి ఉత్తమ వేద విద్యార్థి పురస్కారం



తిరుపతి(రూరల్), మార్చి14 : తిరుపతిలోని కేంద్రీయ విద్యాలయం విద్యార్థి కృష్ణకాంతషడంగీకి జాతీయ స్థాయిలో ఉత్తమ వేద విద్యార్థి పురస్కారం లభించింది. కాశీలోని బెనారస్ హిందూ వర్సిటీలోని భారతీయ సంస్కృత కేంద్రం ద్వారా ఏటా వేదాలలో ప్రతిభచాటిన విద్యార్థులకు ఈ పురస్కారాన్ని అందిస్తారు. ఈ ఏడాదికి సంబంధించి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ప్రదీప్‌జైన్ చేతులమీదుగా కృష్ణకాంతషడంగీ ఈ అవార్డుతోపాటు రూ.2లక్షల నగదు, సర్టిఫికెట్, గోల్డ్‌మెడల్ అందించారు. ఈ విద్యార్థి తండ్రి డాక్టర్ గిరిజాప్రసాద్ షడంగీ ఎస్వీ వేదవర్సిటీలో సామవేద విభాగంలో అధ్యాపకులుగా పనిచేస్తున్నారు.

తెలుగు తమ్ముళ్ల సంబరాలు



పాకాలలో కార్యకర్తల ర్యాలీ





నారావారిపల్లెలో పులివర్తి నానికి స్వాగతం పలుకుతున్న మహిళలు - రామచంద్రపురంలో ర్యాలీ

చంద్రగిరి, మార్చి 14: చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పులివర్తి నాని పేరును టీడీపీ ప్రకటించడంతో గురువారం సాయంత్రం చంద్రగిరిలో తెలుగు తమ్ముళ్లు సంబరాలు చేసుకున్నారు. బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు.నాగాలమ్మ ఆలయం నుంచి చంద్రగిరి, శ్రీనివాసమంగాపురం, ఎ.రంగంపేట మీదుగా నారావారిపల్లె వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.ఎన్టీఆర్ విగ్రహానికి నాని పాలాభిషేకం చేశారు.ఎన్నికలలో గెలుపు కోసం కార్యచరణ రూపొందించుకుని ముందుకు వెళతామన్నారు. టిక్కెట్ ఆశించిన అభ్యర్థులను కూడా కలుపుకొని పార్టీ గెలుపు కోసం పనిచేస్తామన్నారు. చంద్రగిరి, తిరుపతి రూరల్ మండలాల టీడీపీ అధ్యక్షులు సుబ్రమణ్యంనాయుడు, ఈశ్వర్‌రెడ్డి, నాయకులు గౌస్ బాషా, తెలుగు మహిళా కార్యదర్శి సింగు సుధా, నాయకులు అనిమినేని మధు, తులసేశ్వర్‌రెడ్డి, బాలకృష్ణమూర్తి, ప్రవీణ్, బెల్లంకొండ రమేష్‌రాయల్, విశ్వనాథం, ధనంజయరెడ్డి, వెంకటరెడ్డి, వెంకటముని, రాకేష్‌చౌదరి, పాశం చంద్రకుమార్‌నాయుడు, మేడసాని కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎ.రంగంపేట, శానంబట్లలో

ఎ.రంగంపేట, శానంబట్ల గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకొన్నారు. ఎ.రంగంపేటలో టీడీపీ నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు బెల్లంకొండ రమేష్‌రాయల్ ఆధ్వర్యంలో నానికి ఘన స్వాగతం పలికారు. అనంతరం వినాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, కేక్ కట్ చేసి పంచిపెట్టారు.శానంబట్ల గ్రామంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు తులసేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, గ్రామస్థులకు, టీడీపీ కార్యకర్తలకు పంచిపెట్టారు. **పాకాల**: పాకాలలో ఆర్టీసీ బస్టాండు ఎదుట వున్న ఎన్టీఆర్, అంబేద్కర్ విగ్రహాలకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పూలమాలలు వేసి కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. బాణసంచా పేలుస్తూ రైల్వే స్టేషన్ వరకు నానికి మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. **రామచంద్రాపురం** :రామచంద్రాపురంలో టీడీపీ నాయకులు గురువారం టపాకాయలు కాల్చి స్కూటర్ ర్యాలీ నిర్వహించారు.పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, జిల్లా నాయకుడు జనార్దన్‌చౌదరి, నరసింహారెడ్డి, హరిప్రసాద్, విజయకమార్, ఢిల్లీనాథరెడ్డి, ధనంజయరెడ్డి, గిరినాయుడు, జయచంద్రనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కక్షతో దాడి, వాహనం దహనం

● పోలీసులకు టీడీపీ నేత ఫిర్యాదు



దహనమైన వాహనాన్ని పరిశీలిస్తున్న నాని

భాకరాపేట, మార్చి 14: రాజకీయ కక్షతో వైసీపీ యువకులు తనపై దాడి చేసి ద్విచక్ర వాహనాన్ని దహనం చేసినట్లు చిన్నగొట్టిగల్లు మండలం జంగావాండ్లపల్లె పంచాయతీ మారసానివారిపల్లె హరిజనవాడకు చెందిన టీడీపీ నేత జె.బాలాజీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.తాను చినేగేపల్లెకు చెందిన ప్రవీణ్ కుమార్‌రెడ్డితో కలిసి ద్విచక్ర వాహనానికి పెట్రోలు పట్టించడానికి బుధవారం రాత్రి ఎండపల్లెవారిపల్లె సమీపంలోని బంకు వద్దకు వెళ్లానన్నారు.ఎదురుగా టీ స్టాల్ వద్ద ఉన్న పూజారివాండ్లపల్లెకు చెందిన మునిరెడ్డి, అతని స్నేహితుడు నవీన్‌కుమార్ రెడ్డి మరి కొందరితో కలిసి తమపై దాడి చేశారని తెలిపారు. తలపై బలంగా కొట్టడంతో రక్త గాయమైందని, ద్విచక్ర వాహనాన్ని లాక్కొని దానిపై పెట్రోలు పోసి నిప్పంటించి దహనం చేశారని తెలిపారు తనను కులం పేరుతో దూషించడమే కాకుండా చంపుతామని వెంబడించారని, వారి బారి నుంచి తప్పించుకుని పారిపోయామన్నారు.టీడీపీ ఇన్‌ఛార్జ్ నాని ఘటనా స్థలాన్ని పరిశీలించి దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. డీఎస్పీ శరత్ రాజ్‌కుమార్, సీఐ మస్తాన్ వలీ పరిశీలించారు.

ఎన్నికలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు: కలెక్టర్

రామచంద్రాపురం, మార్చి 14:రామచంద్రాపురం మండలంలో వెంకట్రామపురం, కమ్మపల్లి, కొత్తకండ్రిగ, కుప్పంబాదూరు, సి.రామాపురం, కాలేపల్లి, నిలుపురాళ్ల కమ్మపల్లి 2019లో సార్వత్రిక ఎన్నికల్లో రీపోలింగ్ జరిగిన కేంద్రాలను గురువారం సాయంత్రం కలెక్టర్ లక్ష్మీశ తనిఖీ చేశారు ఈ సారి ఎన్నికల్లో రీపోలింగ్, హింసాత్మక ఘటనలు జరగకుండా ఎన్నికల నిర్వహణకు ఈఆర్వో, ఏఈఆర్వోలు, సెక్టోరల్, పోలీసు అధికారులు అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్డీవో నిశాంత్ రెడ్డి, తహసీల్దారు ఉషారాణి, సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

చంద్రగిరి పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన ఎస్పీ

చంద్రగిరి, మార్చి 14: చంద్రగిరి పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ కృష్ణకాంత్ పాటిల్ గురువారం తనిఖీ చేశారు. స్టేషన్ పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు.భాకరాపేట ఘాట్ రోడ్డులో ప్రమాదాలు నివారించాలన్నారు. సీఐ రామయ్య, ఎస్ఐలు అనిత, రవీంద్రనాయ్, సిబ్బంది పాల్గొన్నారు.

పాకాల: పాకాల పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్ గురువారం సందర్శించారు.రికార్డులను పరిశీలించారు. డీఎస్పీ శరత్‌కుమార్ రాజ్, సీఐ రాజగోపాల్, ఎస్సై మహేష్‌బాబు పాల్గొన్నారు.

అండగా ఉంటా - అభివృద్ధి చేసి చూపిస్తా

● పులివర్తి నాని



టీడీపీలో చేరిన కూరపర్తివారిపల్లె వైసీపీ కార్యకర్తలు

ఎర్రావారిపాలెం, మార్చి 14: ప్రజలందరికీ అండగా ఉండి అభివృద్ధి చేసి చూపిస్తానని టీడీపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి పులివర్తి నాని అన్నారు. గురువారం కూరపర్తివారిపల్లె పంచాయతీలో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో నాని మాట్లాడుతూ ప్రతి కార్యకర్త కష్టానికీ తగిన ప్రతిఫలం అందేలా చూస్తానన్నారు. టీడీపీ,జనసేన,బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా తనను గెలిపించాలని కోరారు. కూరపర్తివారిపల్లె పంచాయతీకి చెందిన మట్లి యశ్వంత్, రాంబాబు, కిషోర్, చలపతి, రమణయ్య, సురేష్, సుధాకర్ రెడ్డి, వెంకటాచలపతి, వైసీపీ నుంచి ఓబిలి బాలి రెడ్డి కుటుంబ సభ్యులు నాని సమక్షంలో టీడీపీలో చేరారు.

పులివర్తి నాని అభ్యర్థిత్వంపై సంబరాలు



ర్యాలీలో టీడీపీ మండల అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, నాయకులు

తిరుపతి(రూరల్),మార్చి14:చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పులివర్తి నానీని ఖరారు చేయడాన్ని హర్షిస్తూ తుమ్మలగుంటలో గురువారం పెద్దఎత్తున సంబరాలు చేసుకున్నారు. టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు బిరుదాల భాస్కర్‌రెడ్డి నేతృత్వంలో బాణసంచా కాల్చి, కేక్‌కట్ చేసి సంబరాలు జరిపారు.కేశవులు శెట్టి, శ్రీనివాసులు, సిద్దారెడ్డి, చెంగల్రామానాయుడు, జయచంద్రారెడ్డి, రామకృష్ణ, చెంచుశేఖర్, ఉమాపతి, నవీన్, పరశురామ్, మునీంద్రబాబు, మురుగ, వేణు, బాబు, చెంగల్రాయులు, మహేష్, సురేష్, చంద్రయ్య, సుబ్బయ్య పాల్గొన్నారు. ● రూరల్ మండల అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, రాష్ట్ర టీఎన్‌టీయూసీ నాయకుడు అలిమినేని మధు, సీనియర్ నాయకుడు వైకుంఠం శ్రీధర్‌నాయుడుల నేతృత్వంలో తనపల్లె సర్కిల్ నుంచి బైక్‌ర్యాలీ నిర్వహించారు. గోపీనాథ్, పెరుగు భాస్కర్‌రెడ్డి, ఈశ్వరయ్య, వేణుగోపాల్ నాయుడు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

తిరుపతి(రూరల్),మార్చి14: తిరుపతిరూరల్ మండలంలోని చెర్లోపల్లె జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదివే విద్యార్థులకు మార్పు సేవాసమితి ఆధ్వర్యంలో ప్యాడ్లు, స్కేళ్లు, పెన్సిళ్లు అందించారు. అలాగే స్కూల్ డేని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. హెచ్ఎం సృజన, పూర్వవిద్యార్థి గురునాథం, గురప్పనాయుడు, టీచర్లు పాల్గొన్నారు.

సంక్షోభాన్ని ఎదుర్కొంటేనే అభివృద్ధి

● వియత్నాం ప్రొఫెసర్ లే థు మాక్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 14: ఏ వ్యవస్థ అయినా సంక్షోభాన్ని సరైన రీతిలో ఎదుర్కోవడం ద్వారానే అభివృద్ధి సాధించగలవని వియత్నాంకు చెందిన ప్రొఫెసర్ లే థు మాక్ పేర్కొన్నారు. క్రైసిస్ మేనేజ్‌మెంట్ అంశంపై పద్మావతి యూనివర్సిటీ గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె వర్చువల్ ప్రసంగం చేశారు. సంక్షోభాన్ని తగ్గించడానికి ప్రయత్నం జరగాలన్నారు. తద్వారా విశ్వసనీయతను రక్షించుకోవడానికి, ఖ్యాతిని తిరిగి పొందడానికి ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. ఆయా సంస్థల్లో పనిచేసే వారికి ప్రత్యేక శిక్షణ అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో డీన్ విజయలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.55 కోట్లు

తిరుమల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.55 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి గురువారం ఉదయం ప్రకటించింది. ఇక, బుధవారం 67,832 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 25,636 మంది తలనీలాలు సమర్పించారు.

ఈబీసీ నేస్తం నిధుల జమ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 14: వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం కింద మూడవ విడతలో జిల్లాలోని 17,428మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.26.14కోట్లు జమ చేసినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. గురువారం సీఎం జగన్ బనగానపల్లె నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా కలెక్టరేట్ నుంచి కలెక్టర్, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేశారు. బీసీ కార్పొరేషన్ ఏఈవో బాబురెడ్డి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి భాస్కర్‌రెడ్డి, సహాయ బీసీ సంక్షేమ అధికారులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.





పూర్తిగా దగ్ధమైన మియావాకి వనం

ఎర్రావారిపాలెం; మార్చి 14; శేషాచలం అటవీ ప్రాంతంలోని తలకోన సౌత్ బీట్‌ప్రాంతంలో గురువారం సాయంత్రం వ్యాపించిన అగ్నికీలలు సెంట్రల్ బీట్‌కు వ్యాపించడంతో అటవీ సంపద బూడిదైంది. తలకోన అటవీ ప్రాంతాన్ని కేంద్ర ప్రభుత్వం విలక్షణమైన అటవీ ప్రాంతంగా గుర్తించిన సంగతి తెలిసిందే. ఇక్కడ వృక్ష, జంతుజాలం అరుదైనవి. ఎర్రచందనంతో పాటు పునుగు పిల్లి, పెరీత చెట్లు, అరుదైన వనమూలికలు, ఏనుగులకు ఆవాసం ప్రాంతంగా విస్తరించి ఉంది. ఈ అటవీ ప్రాంతంలోకి ఎవరికీ ప్రవేశం లేదు. కానీ నిత్యం జన సంచారం వల్ల జీవుల మనుగడకు అవరోధంగా పరిణమిస్తోంది. దీని పరిరక్షణకు అటవీ శాఖ ప్రత్యేక నిధులు కేటాయిస్తోంది. మంటలు వ్యాపించకుండా వేసవికి ముందుగానే ఫైర్ ట్రెంచ్‌లు ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలి. మానవ సంచారం లేకుండా చూడాలి. అందుకు భిన్నంగా పరిస్థితులు ఉండటంతో ఆచరణలో అటవీ సంపద హరించుకుపోతోందని పర్యావరణ ప్రియులు ఆవేదన చెందుతున్నారు.

మియావాకి వనం ఆహుతి

చంద్రగిరి, మార్చి 14: చంద్రగిరి కోట సమీపంలో ఏర్పాటు చేసిన మియావాకి వనం అగ్నికి ఆహుతైంది. బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో వనం పూర్తిగా కాలిపోయింది.నీటి సరఫరా చేసే డ్రిప్ ఇరిగేషన్ సామగ్రి కూడా కాలిపోయింది. మూడేళ్ల క్రితం రూ.10 లక్షలతో తుడా మియావాకి వనం ఏర్పాటు చేసింది. తాజా ప్రమాదంతో సుమారు రూ. 5 లక్షల రూపాయల విలువైన చెట్లు, డ్రిప్ ఇరిగేషన్ వస్తువులు కాలిపోయాయని తుడా అధికారులు తెలిపారు. మియావాకీ వనానికి రాయలవారి కోట కూతవేటు దూరంలోనే ఉంది. అగ్నికి ఆహుతి అవుతున్న సందర్భంగా కోట సెక్యూరిటీ కూడా పట్టించుకోలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎవరి ఓటు వారు నిర్భయంగా వేయండి

తిరుపతి(నేరవిభాగం), మార్చి 14 : ఎవరికి కేటాయించిన బూత్‌లకు వారు వెళ్లి ఓటు ప్రశాంతంగా వేయాలని బీఎస్ఎఫ్ దళాలు కోరాయి. ఓటు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ తిరుపతిలో గురువారం బీఎస్ఎఫ్ దళాలు కవాతు నిర్వహించాయి. యూనివర్సిటీ, ఎమ్మార్‌పల్లి, ఎర్రావారిపాలెం స్టేషన్ల పరిధిలో సీఐలు కవాతు నిర్వహించారు. ఎమ్మార్‌పల్లిలో సీఐ అహ్మద్, ఎస్వీయూ సీఐ మురళీమోహన్, ఎర్రావారిపాలెం ఎస్ఐ ఈశ్వర్ నేతృత్వంలో మార్చి ఫాస్ట్ చేశారు. బీఎస్ఎఫ్ దళాలు వెస్ట్ చర్చి నుంచి గాయత్రీనగర్, వైకుంఠపురం, గాంధీపురం, ఉప్పరపల్లి క్రాస్ ప్రాంతాల్లో కవాతు నిర్వహించాయి.



కవాతు నిర్వహిస్తున్న బీఎస్ఎఫ్ దళాలు



చంద్రగిరి కోటకు కాబోయే రారాజు

చంద్రగిరి కోటకు కాబోయే రారాజుకి పట్టాభిషేకానికి సమయం ఆసన్నమైనది.
ఈసారి తెలుగుదేశం విజయపతాకం చంద్రగిరి కోట మీద రెపరెపలాడాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ...
శ్రీ పులివర్తి నాని గారికి అభినందనలు తెలుపుతూ ఈ అవకాశం కల్పించిన
మాన్యశ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి,
భారతీయ జనతా పార్టీ (బి.జె.పి.)కి, జనసేనాని పవన్ కళ్యాణ్ గారికి,
మరియు యువనేత నారా లోకేష్ గారికి,
కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ మీ...

తెలుగుదేశాన్ని గెలిపిద్దాం

NRI TDP UK & EUROPE WING

సైకిల్ గుర్తుకే మన ఓటు

దేశానికి కాంగ్రెస్ శ్రీరామరక్ష



మాట్లాడుతున్న చింతామోహన్

సత్యవేడు, మార్చి 14: దేశానికి కాంగ్రెస్ పార్టీయే శ్రీరామరక్ష అని మాజీ ఎంపీ చింతామోహన్ పేర్కొన్నారు. సత్యవేడులో గురువారం ఆయన ఆధ్వర్యంలో 'తిరుపతి మన రాజధాని సిద్ధం' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక గాంధీ విగ్రహం వద్ద మీడియాతో ఆయన మాట్లాడారు. బీజేపీ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. రాష్ట్రం అభివృద్ధి సాధిం చాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్య క్రమంలో నాయకులు శ్రీరామచంద్రారెడ్డి, రఘునాథ్ రెడ్డి, పురుషోత్తం, గంగాధరం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ కోరారు. వరదయ్యపాళెంలో గురువారం ఆయన ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తం, నరేంద్రనాయుడు, రఫీ, చిరంజీవి పాల్గొన్నారు.

ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం


కేక్ కట్ చేస్తున్న జనసేన నాయకులు

సత్యవేడు, మార్చి 14: సత్యవేడులో జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు రూపేష్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ కేక్‌కట్ చేశారు. అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దాసు హేమ కుమార్, నాయకులు చెంచయ్య, విజయకుమార్ పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: వరదయ్యపాళెంలో గురువారం జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. రానున్న ఎన్నికల్లో జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి లావణ్యకుమార్, వరదయ్య పాళెం మండలాధ్యక్షుడు అంబటి చిరంజీవియాదవ్, నాయకులు తొండం బట్టు శేఖర్, తులసీరామ్, శిరీష, వెంకటేష్, వసంతకుమార్, రమణ, ప్రసాద్, పృథ్వీ, టీడీపీ నాయకులు హరి పాల్గొన్నారు.

అక్షర దోషాలతో శిలాఫలకాల ఆవిష్కరణ


సర్పంచ్, ఎంపీటీసీ పేర్లను స్టిక్కర్‌తో అంటించిన దృశ్యం

రేణిగుంట, మార్చి 14: రేణిగుంటలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన శిలాఫలకాలను ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి గురువారం ఆవిష్కరించారు. అయితే అక్షర దోషాలతో శిలా ఫలకాలు ఏర్పాటు చేశారు. పైగా అందులో ప్రొటోకాల్ పాటించకపోవడం గమనార్హం. పాంచాలినగర్‌లో సీసీరోడ్లు, మురుగుకాల్వ శిలాఫలకాలను ఆవిష్కరించారు. శిలాఫలకంలో ప్రొటోకాల్ ప్రకారం పట్టణ ప్రథమ పౌరుడు సర్పంచ్ పేరు లేదు. అలాగే వార్డు మెంబరు, ఎంపీటీసీ పేర్లు లేకపోవడంతో ప్రొటోకాల్ వివాదం తలెత్తింది. మరో పక్క వార్డు మెంబర్ రసూల్ పేరు వేసుకోవడంతో వైసీపీ క్యాడర్‌లో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అలాగే కలెక్టర్ పేరు సైతం వార్డు సభ్యుడి పేరుకంటే కింద వేశారు. దీంతో ఆవార్డు సభ్యుడి పేరును స్టిక్కర్‌తో మూసివేశారు. మరోపక్క శిలాఫలకాల్లో ఎంపీటీసీల పేర్లు లేకపోవడంతో హడావుడిగా పేర్లురాసిన శిలాఫలకాన్ని తెప్పించి తాత్కాలికంగా నిలిపారు. అప్పటికపుడు స్టిక్కర్లను పేర్ల పక్కన అంటించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రజాప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇపుడు వేసిన శిలాఫలకాలను తొలగించి అందరి పేర్లు వచ్చేలా వేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

ఆసరా చెక్కు పంపిణీ

రేణిగుంట, మార్చి 14: రేణిగుంట పట్టణంలో గురువారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యంతో కలిసి పలు అభివృద్ధి కార్య క్రమాలను ప్రారంభించారు. చెక్‌పోస్టు వద్ద జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఆవిష్క రించారు. మంచినీళ్లగుంట, పలు రోడ్లను, కాలువలను ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణంలో ఏర్పాటు చేసిన సభలో చేయూత లబ్ధిదారులకు చెక్కును అందజేశారు.

రేపటి నుంచి ఆర్జిత సేవలు ప్రారంభం

శ్రీకాళహస్తి, మార్చి 14: ముక్కంటి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు నిర్వహించే ఆర్జిత సేవలు శనివారం నుంచి అమల్లోకి తీసుకు వచ్చేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 3 నుంచి ఆలయంలో ఆర్జిత సేవలను రద్దుచేసి ఏకాంతంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 16 నుంచి యథావిధిగా ఆర్జిత సేవలు కొనసాగనున్నాయి.

జనసేన నాయకుల ఘర్షణ

● పోలీసులకు ఇరువర్గాల ఫిర్యాదు

శ్రీకాళహస్తి, మార్చి 14: శ్రీకాళహస్తి జనసేనలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఇరువురు పరస్పరం శ్రీకాళహస్తిలో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి వినుత పట్టణంలోని గోపాలవనం ప్రాంతంలో పార్టీ కార్యాలయం, నివాస గృహం ఏర్పరచుకున్నారు. ఉమ్మడి అభ్యర్థిగా బొజ్జల సుధీర్ రెడ్డిని కూటమి అగ్రనేతలు ఖరారు చేసిన విషయం తెలిసిందే. జనసేన లోని ఐదుగురు కార్యకర్తలు గురువారం రాత్రి వినుత ఇంటి ఎదుట టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. అసలే బాధలో ఉన్న సమయంలో పార్టీ కార్యాలయం వద్ద ఎందుకు టపాసులు కాలుస్తారంటూ వినుత వర్గం కార్యకర్తలు టపాకాయలు కాలుస్తున్న వారిని నిలదీశారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. అనంతరం ఘర్షణ పడ్డ జనసేన ఇరువర్గాల వారు శ్రీకాళహస్తిలో రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. సీఐ రారాజు శుక్రవారం ఉదయం విచారిస్తామని ఇరు వర్గాలకు సర్ది చెప్పి ఇంటికి పంపారు. కాగా టీడీపీ నాయకులే ఉద్దేశపూర్వకంగా వారితో ఇలా టపాసులు కాల్పించి గొడవలు సృష్టించారని వినుత తల్లి, జనసేన కార్యకర్త చిరంజీవి ఆరోపించారు.

బాలమందిరం విద్యార్థి ప్రాణం తీసిన ఈత సరదా


ముని నిరంజన్ (ఫైల్ ఫొటో)

భాకరాపేట, మార్చి 14: చెరువులో ఈతకు వెళ్లిన బాలుడు మృతి చెందినట్లు తిరుపతి వెస్ట్ స్టేషన్ ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు. రేణిగుంట బుగ్గవీధికి చెందిన కె.మునినిరంజన్(10) తిరుపతి ఎస్వీ బాలమందిరం పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. అదే పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న సతీశ్‌తో కలిసి భాకరాపేట పక్కన ఉన్న నల్లపురెడ్డిగారిపల్లెకు బుధవారం వచ్చాడు. ఇంటి వద్ద ఎవరూ లేకపోవడంతో పక్కనే ఉన్న పేటచెరువులో ఈతకు వెళ్లారు. ముందుగా ముని నిరంజన్ నీటిలోకి వెళ్లి పైకి రాకపోవడంతో సతీశ్ వెనక్కు వచ్చి ఎవరికీ చెప్పకుండా ఉండిపోయాడు. సాయంత్రం మునినిరంజన్ ఇంటికి రాకపోవడంతో అతడి తల్లి స్వాతి విచారించగా ముని నిరంజన్ భాకరాపేటలో బస్సు ఎక్కి వచ్చేశాడని తెలిపాడు. దీంతో స్వాతి వెస్ట్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు సతీశ్‌ను విచారించగా మునినిరంజన్ నీటిలో మునిగిపోయినట్లు అంగీకరించాడు. రాత్రి కావడంతో గురువారం ఉదయం పోలీసులు అగ్నిమాపక సిబ్బందితో గాలింపు చేపట్టి బురదలో కూరుకుపోయిని మునినిరంజన్ మృతదేహాన్ని వెలికితీశారు. స్వాతి ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

వైసీపీలో బయటపడ్డ లుకలుకలు


ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న నేతలు

గూడూరు అర్బన్, మార్చి 14: సబ్‌కలెక్టర్ కార్యాలయంలలో ఆవరణంలో గురువారం లబ్ధిదారులకు ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైసీపీలో లుకలుకలు బయటపడ్డాయి. ఈ కార్యక్రమానికి జడ్పీటీసీ సభ్యురాలు పూటుకూరు యామినిని ఆహ్వానించలేదని ఆమె భర్త మహేంద్రరెడ్డి సభావేదికపై బహిరంగంగా మున్సిపల్ కమిషనర్‌తో వాగ్వాదానికి దిగాడు. దీంతో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైసీపీలో వర్గవిభేదాలు బయటపడ్డాయన్న గుసగుసలు వినిపించాయి. దీనిపై మహేంద్రరెడ్డి మాట్లాడుతూ.. ప్రొటోకాల్ పాటించకుండా కార్యక్రమాన్ని నిర్వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ, ఆర్డీవో కిరణ్‌కుమార్, తహసీల్దారు కరుణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, చేవూరు విజయ్‌మోహన్‌రెడ్డి, బాబురెడ్డి, మహేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెంగాళమ్మ హుండీ ఆదాయం
రూ.50 లక్షలు

సూళ్లూరుపేట, మార్చి 14: చెంగాళమ్మ ఆలయ హుండీ లెక్కింపును గురువారం దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. మూడు నెలలకుగాను రూ.49,76,626 ఆదాయం వచ్చిందని సహాయ కమిషనర్ డబ్బు వెంకటేశ్వర్లు తెలిపారు. 78 యూఎస్‌ఏ డాలర్లు, యుఏఈ దిరహమ్స్ 10, మలేసియాకు చెందిన 2 రింగిట్, కెనడా డాలర్స్ 5, ఇండోనేషియా చెందిన 5,500 రూపాయలు, 70 గ్రాముల బంగారు, 183 గ్రాముల వెండి లభించింది. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస బాబ, ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రా రెడ్డి, పాలక మండలిసభ్యులు ముంగర అమరావతి పాల్గొన్నారు.

వెంకటగిరి అభివృద్ధికి కృషి చేస్తా

పోలేరమ్మ సేవలో టీడీపీ అభ్యర్థి లక్ష్మీ సాయిప్రియ

వెంకటగిరి, మార్చి 14: వెంకటగిరి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీ సాయిప్రియ అన్నారు. గురువారం టీడీపీ అధిష్టానం వెంకటగిరికి తన పేరును ఖరారు చేయగానే ఆమె తన తండ్రి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, పార్టీ శ్రేణులతో కలిసి ప్రదర్శనగా వెళ్లి గ్రామశక్తి పోలేరమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. కురుగొండ్ల వారసురాలిగా అధిష్టానం తన పేరును ప్రకటించినట్లు తెలిపారు. వెంకటగిరి ఆడపడుచుగా తనను ఆశీర్వదించాలని కోరారు. పార్టీలో అందరినీ కలుపుకుని ముందుకెళతానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం స్వగృహానికి వచ్చిన ఆమెను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరావు సత్కరించారు.

నా బిడ్డను ఆదరించండి: కురుగొండ్ల : 'నా బిడ్డ లక్ష్మీ సాయి ప్రియను నన్ను ఆదరించినట్లే ఆశీర్వదించి అసెంబ్లీకి పంపించండి' అని వెంకటగిరి నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. గురువారం రాత్రి పుట్టింటికి వచ్చిన ఆమెను తన సహచరులకు పరిచయం చేశారు.

పలువురి హర్షం: లక్ష్మీ సాయి ప్రియకు టికెట్ ఇవ్వడంపై పలువురు టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. వీరిలో.. మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యులు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, మాజీ ఎంపీపీ పోలంరెడ్డి వెంకటరెడ్డి, ఆస్పత్రి సలహా కమిటీ మాజీ ఛైర్మన్ చెలికం భాస్కరరెడ్డి తదితరులున్నారు.



టీడీపీ శ్రేణులు, కురుగొండ్ల రామకృష్ణతో ప్రదర్శనగా వచ్చి పోలేరమ్మను దర్శించుకున్న లక్ష్మీ సాయిప్రియ

టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి: గంగాప్రసాద్


టీడీపీ నేతలతో మాట్లాడుతున్న గంగా ప్రసాద్

వెంకటగిరిలో టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ నేతలను పారిశ్రామిక వేత్త గంగాప్రసాద్ కోరారు. తన కోడలు లక్ష్మీ సాయి ప్రియను వెంకటగిరి అభ్యర్థిగా ప్రకటించడంతో గురువారం టీడీపీ ముఖ్య నేతలతో తనింట్లో సమావేశమయ్యారు. కొన్ని పరిస్థితుల కారణంగా లక్ష్మీ సాయి ప్రియను పార్టీ ఎంపిక చేసిందని వివరించారు. ఇప్పటికే వైసీపీ ప్రభుత్వంపై ప్రజలు విసిగిపోయి ఉన్నారని, ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకుని టీడీపీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు పార్టీలో ఎప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం: నెలవల

నాయుడుపేట టౌన్, మార్చి 14: వైసీపీ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. రాష్ట్రాభివృద్ధి జరగాలంటే చంద్రబాబు సీఎం అయితేనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. పెళ్లకూరు మండలం శిరసనంబేడు గ్రామానికి చెందిన 20 మంది వైసీపీ కార్యకర్తలు గురువారం టీడీపీలోకి చేరారు. వీరందరికీ తెలుగు రైతు నేత శివకోటేశ్వరరెడ్డితో కలిసి టీడీపీ కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. సూళ్లూరుపేట టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీని అఖండ మెజార్టీతో గెలిపించి సూచించారు. టీడీపీ నాయకులు సంచి కృష్ణయ్య, గుంటపూడి రమణయ్య, ముసులూరు రామచంద్రారెడ్డి, దాసరి వెంకటకృష్ణయ్య, ప్రసాద్‌నాయుడు, పరుశురామ్, జనసేన నాయకులు కామిరెడ్డి కేశవరెడ్డి, గోపీ, రమేష్‌రెడ్డి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. కాగా.. నాయుడుపేట పట్టణంలోని చంద్రబాబుకాలనీలో గురువారం రాత్రి పాస్టర్ ఎస్.వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో క్రైస్తవులతో జరిగిన సమావేశంలో సూళ్లూరుపేట టీడీపీ అభ్యర్థి విజయశ్రీ ప్రసంగించారు. వైద్య వృత్తిని వదిలి ప్రజాసేవ కోసం వచ్చానని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని కోరారు. టీడీపీ నాయకులు నెలవల రాజేష్, చక్రపాణి, సుజాతమ్మ, శ్రీనివాసులు, ముత్యాలయ్య, పసల సురేష్, తదితరులు పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలతో నెలవల సుబ్రహ్మణ్యం


విజయశ్రీతో గున్నం సేవా ట్రస్ట్ అధినేత మధురెడ్డి తదితరులు

గున్నం సేవాట్రస్ట్ అధినేతను కలిసి విజయశ్రీ

ఓజిలి: భట్లకనుపూరులోని గున్నం సేవా ట్రస్ట్ అధినేత మధురెడ్డిని సూళ్లూరుపేట టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పలువురు నాయకులతో కలిసి మధురెడ్డితో భేటీ అయ్యారు. ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని కోరారు. నాయుడుపేట ఏఎంసీ ఛైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ రఫీ, స్థానిక నాయకులు రవీంద్రరెడ్డి, ధనుంజయ, శ్రీనివాసులు, నాయుడుపేట, పెళ్లకూరు మండలాలకు చెందిన పలువురు నాయకులున్నారు.

ఈబీసీ నేస్తం నిధుల జమ

జిల్లాలోని లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ.26.14కోట్లు


లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 14: వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం కింద మూడవ విడతలో జిల్లాలోని 17,428మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.26.14కోట్లు జమ చేసినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. గురువారం సీఎం జగన్ బనగానపల్లె నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా కలెక్టరేట్ నుంచి కలెక్టర్, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేశారు. బీసీ కార్పొరేషన్ ఏఈవో బాబురెడ్డి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి భాస్కర్‌రెడ్డి, సహాయ బీసీ సంక్షేమ అధికారులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

400 మొబైల్ ఫోన్ల రికవరీ

తిరుపతి (నేరవిభాగం), మార్చి 14 : తిరుపతి జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల్లో అపహరణకు గురైన దాదాపు రూ.72 లక్షల విలువ చేసే 400 మొబైల్ ఫోన్లను పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్ తన ఛాంబర్‌లో వాటిని బాధితులకు అందజేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏడాది కాలంలో 8 విడతల్లో 2,630 సెల్ ఫోన్లను రికవరీ చేసినట్లు చెప్పారు. ఫోన్లను రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్, సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు వెంకట్రావు, డీఎస్పీ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న మొబైల్స్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

మాజీ కమిషనర్‌పై విజిలెన్స్ విచారణ జరపాలి

కౌన్సిలర్ల డిమాండ్



సమావేశంలో ప్రసంగిస్తున్న కమిషనర్ రషీద్, వేదికపై చైర్‌పర్సన్ భానుప్రియ - ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ జానకిరామయ్య

వెంకటగిరి టౌన్, మార్చి 14: మాజీ మున్సిపల్ కమిషనర్ బీవీ రమణయ్యపై విజిలెన్స్ విచారణ జరిపించాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ఛైర్‌పర్సన్ నక్కా భానుప్రియ అధ్యక్షతన గురువారం కౌన్సిల్ బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఆరో వార్డు కౌన్సిలర్ జానకిరామయ్య మాట్లాడుతూ.. కౌన్సిల్ ఆమోదం లేకుండా మాజీ కమిషనర్ రూ.70లక్షలు మింగేశారని ఆరోపించారు. నూతన కమిషనర్ బాధ్యతలు తీసుకున్నాక కూడా మున్సిపల్ కార్యాలయంలో చొరబడి ఫైల్స్ కాల్చేశారని విమర్శించారు. ఆయనపై విజిలెన్స్ విచారణ చేయించాల్సిందేనని కౌన్సిలర్లంతా కలిసి కమిషనర్‌కి అర్జీని అందించారు.

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం: 14వ వార్డు కౌన్సిలర్ శంకరయ్య మాట్లాడుతూ.. కోట్లాది రూపాయల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్న పాలవర్గం పట్టించుకోకపోవడం సిగ్గుచేటుగా ఉందన్నారు. మున్సిపాలిటీలో అనుమతులు రాకుండా పెద్ద పెద్ద భవంతులు కడుతున్నారని ధ్వజమెత్తారు. 9వ వార్డు కౌన్సిలర్ కల్యాణి మాట్లాడుతూ.. ఎస్సీ కాలనీలో నీటి ఎద్దడితోపాటు పలుచోట్ల వీధిదీపాలు లేవని చెప్పారు.

ఇళ్ల స్థలాల పేరుతో వైసీపీ ఎర

రేణిగుంట, మార్చి 14: కోర్టు వివాదాల్లో ఉన్న భూముల్లో స్థలాలు కేటాయిస్తామంటూ వైసీపీ మరోసారి ప్రజలను మభ్యపెడుతోంది. రేణిగుంట మండలంలోని ప్రజలకు పాగాలి ప్రాంతంలో జగనన్న ఇంటి పట్టాలను కేటాయించారు. అయితే అక్కడి రైతులు తమ భూములకు సరైన గిట్టుబాటు ధర రాలేదని కోర్టుకెక్కారు. ఫలితంగా పట్టాదారులకు స్థలాలు చూపలేని పరిస్థితి. ఈ క్రమంలో టీడీపీ కోర్టుకు పోవడం వల్ల స్థలాలు చూపలేక పోయామని వైసీపీ నాయకులు ప్రచారం చేపట్టారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో షాడో ఎమ్మెల్యే గురువారం స్థానిక వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. పట్టాలు పొందిన వారికి స్థలాలు చూపుతామని వలంటీర్ల ద్వారా సమాచారం అందజేస్తున్నారు.

నేడు ఏకాంత సేవ

శ్రీకాళహస్తి, మార్చి 14: శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్వామి, అమ్మవార్ల ఏకాంత సేవ జరగనుంది. మ్మవారి సన్నిధిలో శయన మందిరంలో ఈ క్రతువును నిర్వహించనున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం: ముగ్గురికి గాయాలు



బస్సు కిందకు దూసుకెళ్లిన కారు

చిల్లకూరు, మార్చి 14: ఆగి ఉన్న బస్సును వెనుక నుంచి కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందగా, మరో ముగ్గురు గాయపడ్డారు. చిల్లకూరు మండలంలోని బూదనం టోల్‌ప్లాజా సమీపంలో గురువారం వేకువ జామున ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గిద్దలూరు నుంచి చెన్నైకి వెళుతున్న ఆర్టీసీ బస్సు టైరు పంక్చర్ కావడంతో టోల్‌ప్లాజా సమీపంలో రోడ్డు పక్కన ఆపారు. తర్వాత పంక్చర్ వేయడానికి బస్సు వెనుక రాళ్లు పెడుతుండగా.. తాడేపల్లిగూడెం నుంచి చెన్నైకి వెళుతున్న ఓ కారు అదుపుతప్పి ఆగి ఉన్న బస్సును వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు వెనుక రాళ్లు పెడుతున్న ప్రకాశం జిల్లా బెస్తవారిపేట ప్రాంతానికి చెందిన డ్రైవర్ మలన్‌షా వల్లీ(52), కారులో డ్రైవర్ పక్కన కూర్చొని ఉన్న తాడేపల్లిగూడెంకు చెందిన సుదర్శన్‌రావు(68) అక్కడికక్కడే మృతి చెందారు. కారు డ్రైవర్ రామచంద్రరావు, సుదర్శన్‌రావు భార్య పద్మావతి, కుమార్తె అనురాధలకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు గాయపడిన వారిని చికిత్స నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో బాధితులను ఆర్డీవో కిరణ్‌కుమార్ పరామర్శించారు. కాగా, సుదర్శన్‌రావు తన కుమార్తెకు వైద్యపరీక్షలు చేయించడానికి కారులో చెన్నైకి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగిందని కుటుంబీకులు తెలిపారు. ఎస్‌ఐ అంజిరెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



బస్సు డ్రైవర్ డీఎం వల్లీ, కారులో సుదర్శన్‌రావు మృతదేహాలు

పుత్తూరు వార్తలు

చేయూత చెక్కుల పంపిణీ


డిగ్రీ కళాశాలలో భవనాన్ని ప్రారంభించిన మంత్రి రోజా

పుత్తూరు, మార్చి 14: పుత్తూరు, వడమాలపేట మండలాల్లో వైఎస్ఆర్ చేయూత నాల్గవ విడత రూ.40.02 లక్షల చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి రోజా గురువారం పుత్తూరు ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల ఆవరణంలో నిర్వహించారు. అలాగే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రోజా చారిటబుల్ ట్రస్టు రూ.12 లక్షలతో నిర్మించిన స్కిల్ డెవలెప్‌మెంట్ కేంద్ర భవనాన్ని ప్రారంభించి, వితరణ చేసిన 20 కుట్టు మిషన్లను మహిళలకు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ ఛైర్మన్ హరి, కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి, పుత్తూరు, వడమాల పేట ఎంపీపీలతోపాటు వైసీపీ నాయకులు జయప్రకాష్, శంకర్, ఏకాంబరం పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ



పుత్తూరు టౌన్, మార్చి 14: పిళ్లారిపట్టు ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు జీవనజ్యోతి సోషల్ వెల్ఫేర్ సొసైటీ సంస్థ అధ్యక్షుడు చిన్నబ్బ ఆధ్వర్యంలో గురువారం విద్యాసామగ్రి వితరణ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునిలక్ష్మి, వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షులు వడివేలు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బీసీలకు అండగా ఉంటా: గాలి భానుప్రకాష్


టీడీపీలో చేరిన సుబ్రహ్మణ్యం యాదవ్ తదితరులతో భాను ప్రకాష్

వడమాలపేట, మార్చి 14: టీడీపీ విజయం కోసం అహర్నిశలు పాటుపడే బీసీలకు అండగా ఉంటానని నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ స్పష్టం చేశారు. గురువారం తిరుపతిలోని ఆయన నివాసంలో జిల్లా యాదవ సంఘం నాయకులు, మండలంలోని ఎస్‌బీఆర్‌పురం గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం యాదవ్ తన అనుచరులతో కలిసి టీడీపీలో చేరారు. వీరిని టీడీపీలోకి ఆహ్వానిస్తూ పార్టీ కండువాను భానుప్రకాష్ కప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీకి వెన్నుదన్నుగా ఉండేది బీసీ లేనన్నారు. మీ ఆశీస్సులతోనే విజయం సాధిస్తామన్నారు. టీడీపీ నాయకులు చినబాబు, మణిరాజు, జానా వెంకటయ్య, ధనంజయులు నాయుడు, దాముయాదవ్, పెద్దబ్బరాజు, శేషాద్రియాదవ్, హేమావతి, దేవ, చిరంజీవి, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ రికార్డుల గదికి భద్రత కల్పించండి


కూల్చివేసిన పాత రెవెన్యూ కార్యాలయ భవనం

పుత్తూరు, మార్చి 14: పుత్తూరు మండల రెవెన్యూ కార్యాలయం ఆవరణంలో కొత్తగా నిర్మించిన పురపాలక సంఘం భవనానికి దారి కోసం.. బ్రిటిష్ కాలానికి చెందిన పాత రెవెన్యూ కార్యాలయ భవనాన్ని గురువారం కూల్చివేశారు. అయితే పాత భవనంలోని ఓ గదిలో పాత తాలూకా పరిధిలోని ఏడు మండలాల రెవెన్యూ రికార్డులు ఉన్నాయి. మండల వ్యవస్థ ఏర్పడి దాదాపు నలభై ఏళ్లు అయినా ఆయా మండలాలకు సంబంధించిన పాత రికార్డులు ఇంకా ఆ గదిలోనే ఉన్నాయి. దీంతో ఇప్పటికీ ఆయా మండలాల నుంచి ఆర్టీఐ యాక్టు కింద అడిగే పాత రికార్డుల నకళ్ల కోసం ఇక్కడి కార్యాలయానికి దరఖాస్తులు వస్తుండడం విశేషం. ఈ ప్రాధాన్యం దృష్ట్యా రికార్డు గది రానున్న వర్షాలకు కూలకుండా ఉండటానికి భద్రత కల్పించాలని కమిషనర్‌ను మండలాధికారి శ్రీనివాస గౌడ్ కోరారు.

రైతులకిచ్చిన హామీలు నెరవేర్చాలి: సీఐటీయూ



ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

పుత్తూరు టౌన్, మార్చి 14: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం అంబేడ్కర్ సర్కిల్ వద్ద ధర్నా నిర్వహించారు. సీఐటీయూ నాయకుడు వెంకటేష్ మాట్లాడుతూ.. రైతులకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన మూడు నల్ల చట్టాలను రద్దు చేయకుంటే ఆందోళన మరింత ఉధ్రుతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు సుబ్రహ్మణ్యం పిళ్లై, విజయ్, శివ, రమేష్, వెంకటేష్, హరీష్, దేవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధులకు సిద్ధవైద్యంతో చెక్


పూడి గ్రామంలో వైద్యశిబిరం

వడమాలపేట, మార్చి 14: దీర్ఘకాలిక వ్యాధులను సిద్ధ వైద్యంతో నయం చేయొచ్చని సిద్ధ వైద్య పరిశోధనా విభాగం (తిరుపతి)కి చెందిన వైద్యులు డాక్టర్ రాజ్యలక్ష్మి, తమిళ సెల్వి తెలిపారు. గురువారం పూడి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ చక్రపాణి, డాక్టర్ సామ్రాజ్, సామాజిక ఆరోగ్యాధికారి పురుషోత్తం రెడ్డి, సూపర్‌వైజర్ చంద్రమోహన్, ఏఎన్ఎం విజయ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.55 కోట్లు

తిరుమల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.55 కోట్లు లభించింది. మంగళవారం ఉదయంనుంచి రాత్రివరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి గురువారం ఉదయం ప్రకటించింది. ఇక, బుధవారం 67,832 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

టీడీపీలోకి వలంటీరుతో సహా పలువురు



ఏర్పేడు, మార్చి 14: ఏర్పేడు మండలం ఆమందూరు సచివాలయ పరిధిలో ఉన్న చెంచుముని అనే గ్రామ వలంటీరు టీడీపీలో చేరారు. బొజ్జల సుధీర్‌రెడ్డి స్వగృహం వద్ద గురువారం వలంటీరుతో పాటు ఆ గ్రామ యువత గురవ, సాంబ, నవీన్, గోపిసాయి, గణేష్, వెంకటముని, గోపి టీడీపీలో చేరారు. వారికి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి పసుపు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధనంజయ నాయుడు, పొన్నారావు, తిరుమలయ్య, నాగరాజు నాయుడు, గుణయాదవ్, రాచేటి సుబ్రహ్మణ్యం, కృష్ణవేణి, చంద్రారెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సరిపడా నీటితో మూత్రపిండాలు ఆరోగ్యం

రేణిగుంట, మార్చి 14: శరీరానికి సరిపడే నీటిని తీసుకోవాలని అప్పుడే మూత్రపిండాలు ఆరోగ్యంగా ఉంటాయని డాక్టర్ శివపార్వతి తెలియజేశారు. అంతర్జాతీయ మూత్రపిండ దినోత్సవం సందర్భంగా అమర ఆస్పత్రిలో మూత్ర పిండాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఆహారంలో ఉప్పు తక్కువగా వినియోగించాలని సూచించారు. బీపీ, షుగర్ బాధితుకు కిడ్నీ సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని అలాంటివారు ఏడాదికి ఒకసారైనా కిడ్నీ సంబంధిత పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

వరదయ్యపాళెం ఎస్‌ఐగా గౌస్ పీర్



వరదయ్యపాళెం, మార్చి 14: శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా గౌస్‌పీర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. పలువురు సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈయన అనంతపురం జిల్లా ధర్మవరం నుంచి బదిలీపై వచ్చారు.

ముక్కంటి ధర్మకర్తల మండలిలో మరో ఐదుగురు

శ్రీకాళహస్తి, మార్చి 14: ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలిలో ప్రత్యేక ఆహ్వానితుల హోదాలో మరో ఐదుగురికి స్థానం కల్పించారు. ఈ మేరకు వారు గురువారం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ నెల 8వ తేదీన 14 మంది సభ్యులతో సహా అంజూరు శ్రీనివాసులు ఛైర్మన్‌గా ఏడాది కాల పరిమితితో కొత్త మండలిని నియమించిన విషయం తెలిసిందే. అదేరోజు సభ్యులతో పాటు 9 మంది ప్రత్యేక ఆహ్వానితులకు మొదట అవకాశం కల్పించారు. మళ్లీ గురువారం తాజాగా ఐదుగురిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మహిళా టీచర్లకు సన్మానం



పిచ్చాటూరు, మార్చి 14: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా ఉపాధ్యాయులను ఎంఈవో హేమాలిని గురువారం ఘనంగా సన్మానించారు. మహిళా ఉపాధ్యాయులకు వివిధ క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పూల మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహసీల్దార్ హుస్సేన్, ఎంపీడీవో శ్రీనివాసులు కీలపూడి ఎంపీపీ పాఠశాల టీచర్ విమలమ్మను చీర, సారెతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో యుగంధర్‌రాజు, ఉపాధ్యాయులు నరేష్, వెంకటేశులు, కుప్పరాజు, బాలాజీ, డీటీ సుందరం, ఏవీ.రాజు, కె.ప్రకాష్, సుందరకుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ కూరగాయలతో ఆరోగ్యం



బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 14: ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూర గాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని ప్రకృతి వ్యవసాయ అధికారి రామాంజనేయులు తెలిపారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో గురువారం కూరగాయల అమ్మకాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గాజులపెళ్లూరు, ఆలత్తూరు, వీఎస్‌పురం, కనమనంబేడు తదితర గ్రామాలలో రైతు సాధికారిత సంస్థ ఆధ్వర్యంలో పలువురు రైతులు కూరగాయలను, వరి పంటలను ప్రకృతి వ్యవసాయ విధానంలో పండిస్తున్నట్లు చెప్పారు. ప్రకృతి వ్యవసాయ చేసే రైతులకు ప్రభుత్వం రాయితీలను ఇస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో ఏపీఎం ఇందిరాగాంధీ, రిసోర్సు పర్సన్లు, జయలక్ష్మి, ఆశా, రేవతి పాల్గొన్నారు.

శివయ్య కూడలి ప్రారంభం

శ్రీకాళహస్తి, మార్చి 14: శ్రీకాళహస్తిలోని ఏపీ సీడ్స్ వద్ద శివయ్య కూడలిని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. గురువారం ధ్యానమూర్తి శివయ్య ప్రతిమను శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముక్కంటి ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీని వాసులు, ఈవో నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే సమాజ అభివృద్ధి

శ్రీకాళహస్తి, మార్చి 14: మహిళా సాధికారతతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని కెనరా బ్యాంక్ మేనేజర్ కల్పన అన్నారు. పట్టణంలోని రాస్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాస్ స్వచ్ఛంద సంస్థ మహిళా అభ్యున్నతి కోసం పొదుపు సంఘాలను ప్రోత్సహించడం హర్షణీయం అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ హరికృష్ణ, రాష్ట్ర సంస్థ నిర్వాహకులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

శ్రీకాళహస్తి, మార్చి 14: నిరంకుశ వైఖరితో రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి అన్నారు. ఢిల్లీలో పోరాడుతున్న రైతులకు మద్దతుగా గురువారం శ్రీకాళహస్తిలోని అంబేద్కర్ కూడలి వద్ద సీపీఐ నాయకులు నిరసన ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజక వర్గ కార్యదర్శి జనామాల గురవయ్య, సీపీఎం నియోజకవర్గ కార్యదర్శి పుల్లయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మండుటెండలో ఫారంపాండ్ పనులు



కేవీబీపురం మార్చి14: మండలంలో ఉపాధి పనులు జోరందుకున్నాయి. రైతులకు పనులు లేకపోవడంతో ఎక్కువ మంది ఉపాధి పనిపై దృష్టిసారించారు. అయితే పనుల వద్ద నీరు, నీడ, ప్రథమ చికిత్స కిట్ సౌకర్యం లేదు. 15 రోజులకు ఓ సారి చెల్లించాల్సిన కూలి సక్రమంగా చెల్లించడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో కూలీలు పనులకు వెళుతున్నారు.

శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ఆవిష్కరణ



శ్రీకాళహస్తి, మార్చి 14: విజయనగర సామ్రాజ్య అధినేత శ్రీకృష్ణదేవరాయలతో శ్రీకాళహస్తి ప్రాంతానికి ఎన్నటికీ విడదీయలేని అనుబంధం ఉందని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. పట్టణంలోని రాజగోపురం ఎదుట గురువారం శ్రీకృష్ణదేవ రాయల కాంస్య విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముక్కంటి ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే బారికేడ్‌లో ఇరుక్కుపోయిన కంటైనర్



రేణిగుంట, మార్చి 14: రేణిగుంట చెక్‌పోస్టు వద్ద ఉన్న రైల్వే వంతెన సమీపంలో ఏర్పాటు చేసిన ఇనుప బారికేడ్‌లో ఓ కంటైనర్ ఇరుక్కుపోయి ఆగిపోయింది. ఫలితంగా గురువారం సాయంత్రం గంట సేపు ట్రాఫిక్ స్తంభించిపోయింది. అటుగా వెళ్లాల్సిన వాహనాలను సంత గేటు మీదుగా దారి మళ్లించారు. దాదాపు గంట తర్వాత కంటైనర్‌ను బయటకు తీసి పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేశారు.

అమోఘం.. నృత్యాభినయం





కుందనశ్రీ, హేశ్విక, నివేదిక నృత్య ప్రదర్శనలు ● దేగల సాంబశివరావు నృత్యప్రదర్శన



లాస్య ఇన్‌స్టిట్యూట్ యువతి కూచిపూడి

తొట్టంబేడు, మార్చి 14: శ్రీకాళహస్తి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం శ్రీకాళహస్తిలోని స్వర్ణముఖి నదీతీరాన ఏర్పాటు చేసిన ధూర్జటి కళా ప్రాంగణంలో జరిగిన నృత్యప్రదర్శనలు ఆహూతులను అబ్బురపరిచాయి. శ్రీకాళహస్తికి చెందిన మట్టెకుందనశ్రీ నృత్యప్రదర్శన, తిరుపతికి చెందిన హేశ్విక, నివేదిక నృత్య ప్రదర్శనలు, నెల్లూరుకి చెందిన దేగల సాంబశివరావు నృత్యప్రదర్శనలు, కర్నూలుకు చెందిన గంగాధరం లాస్య ఇన్‌స్టిట్యూట్ కూచిపూడి వారి నృత్యప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టు కున్నాయి. కళాకారులను దేవస్థానం అధికారులు దుశ్శాలువాతో సత్కరించి స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు.

హోరెత్తిన పసుపుదళం కేరింతలు



శ్రీకాళహస్తిలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సుధీర్ రెడ్డి



ఏర్పేడులో స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు

శ్రీకాళహస్తి, మార్చి 14: ఎమ్మెల్యే అభ్యర్థిగా బొజ్జల సుధీర్‌రెడ్డిని టీడీపీ అధిష్ఠానం ప్రకటించడంపై పసుపుదళం కేరింతలతో శ్రీకాళహస్తి హోరెత్తింది. టిక్కెట్ ప్రకటన విషయం తెలిసిన వెంటనే సుధీర్‌రెడ్డి కుటుంబ సమేతంగా ముక్కంటిని దర్శించుకున్నారు. సాయంత్రం ఏపీ సీడ్స్ కూడలి నుంచి ప్రజలతో సుధీర్‌రెడ్డి ర్యాలీగా ఆర్టీసీ బస్టాండ్ వరకు ప్రచార రథంపై వచ్చారు. నియోజకవర్గం నలుమూలల నుంచి టీడీపీ నాయకులు, కార్య కర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. ఆర్టీసీ కూడలి వద్ద అంబేడ్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టీడీపీ కార్యాలయంలోకి చేరుకున్నారు. భారీగా జనంతో రావడంతో కార్యాలయం కిక్కిరిసి పోయింది. సుధీర్‌రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించడంపై టీడీపీ పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్, శ్రీకాళహస్తి పాలసరపరా సంఘం మాజీ ఛైర్మన్ మునిరాజునాయుడు, తిరుపతి పార్లమెంట్ కోశాధికారి కంఠా రమేష్ హర్షం వ్యక్తం చేశారు.

ఏర్పేడు: శ్రీకాళహస్తి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బొజ్జల సుధీర్‌రెడ్డిని అధినేత చంద్రబాబు గురువారం ప్రకటించారు. దీంతో ఏర్పేడు మండలంలో ఆ పార్టీనాయకులు సంబరాలు చేసుకున్నారు. మోదుగులపాళెంలో భారీ ఎత్తున బాణాసంచా కాల్చి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మణి, దయాకర్, మంచు మస్తాన్‌నాయుడు, శివ, మణి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల వద్ద వసతులు కల్పించండి



పనులను పరిశీలిస్తున్న పీడీ

బుచ్చినాయుడు కండ్రిగ, మార్చి 14: ఉపాధి పనులు జరిగే చోట నీడ, తాగునీరు సౌకర్యంతో పాటు ప్రథమ చికిత్స బాక్సును అందుబాటులో ఉంచాలని ఉపాధి హామీ పీడీ శ్రీనివాసప్రసాద్ సిబ్బందికి సూచించారు. మండలంలోని తలారివెట్టు గ్రామ సమీపంలోని ఫారెస్టులో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల నేపథ్యంలో ఉదయం 11గంటలకు పనులు ముగిసేలా ప్రణాళికలు రూపొందించు కోవాల న్నారు. కూలీలకు పనుల కల్పనలో సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఏపీఎం భానుప్రియ, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలి



సమావేశమైన ఉపాధ్యాయులు

ఏర్పేడు, మార్చి 14: విద్యార్థులు మంచి మార్కులు సాధించి తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చి దిద్దుకోవాలని రామకుప్పం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణ స్వామి కోరారు. గురువారం పల్లం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆనంద్ బీఎన్‌కండ్రిగ ఎంఈవో మునిసుబ్రహ్మణ్యం, రామకుప్పం పూర్వవిద్యార్థులు ఎబినైజర్, వెంక టయ్య, చెంగల్‌రాయప్ప, వెంకటరమణ, పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ సుధాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు మెహర్‌బాబా, రెడ్డెప్ప, రామచంద్రయ్య, శ్రీనివాసులు, సురేష్, పుష్పవాణి, వాణి, సుబ్రహ్మణ్యం, శ్రీరాములు, గంగులయ్య, రామసుబ్బమ్మ, వర్దేశ్వరి పాల్గొన్నారు.

వెలుగులో అక్రమాల కేసులో సీసీ అరెస్టు



పోలీసులు అదుపులో ఉన్న సీసీ

వరదయ్యపాళెం, మార్చి 14: వెలుగు అక్రమాలకు సంబంధించి ఓ సీసీని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. వరదయ్యపాళెం మండలంలో వెలుగు గ్రూపుల్లో జరిగిన అక్రమాలకు సంబంధించి సుమారు మొత్తం 9మందిపై పోలీసులు ఏడాది క్రితం కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో చిల్లకూరు మండలం బూదనం పోస్టు ఎన్‌ఆర్‌పల్లి చెందిన సీసీ పుల్లయ్య ఒక గ్రూపు డబ్బులు మరో గ్రూపునకు కడుతూ వచ్చే క్రమంలో నగదు నిల్వలో తేడా వచ్చిందని గుర్తించారు. ఇలా మొత్తం 30 గ్రూపులకు సంబంధించి రూ.10,60,342 నిల్వ ఉండాల్సి ఉండగా రూ.7,45,902 మాత్రమే ఉంది. మిగతా రూ.3.15లక్షలు తేలాల్సి ఉంది. దీంతో ఆయన్ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మిగిలిన వారిపై విచారణ జరుగుతోందని త్వరలో అరెస్టుచేస్తామని సీఐ దివాకర్‌రెడ్డి, ఎస్‌ఐ ప్రతాప్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ షణ్ముగం, కానిస్టేబుల్ సాయిబాబా, హరి, సుబ్రహ్మణ్యం తదితరులున్నారు.

సచివాలయ భవనం ప్రారంభం

తొట్టంబేడు, మార్చి 14: మండలంలోని పెద్దకన్నలిలో నిర్మించిన సచివాలయం, ఆర్బీకే భవనాలను గురవారం ఎమెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. అలాగే తాగునీటి పైప్‌లైన్, మల్లిగుంటలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో ఎంపీపీ నిర్మల, వైస్‌ఎంపీపీ మల్లికమ్మ, గెరటారెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల అధికారులు పాల్గొన్నారు.

గజవాహనంపై గజేంద్రమోక్ష ప్రదాత



తొట్టంబేడు, మార్చి 14: శ్రీకాళహస్తి మండలంలోని తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం స్వామివారు గజ వాహనంపై పురవీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు సమర్పించారు.

తాగునీటి మోటారు ప్రారంభం

పిచ్చాటూరు, మార్చి 14: పిచ్చాటూరు మండలం టీచర్స్ కాలనీలో కొలువైన చెంచమ్మ ఆలయానికి పిచ్చాటూరు ఎంపీపీ రేఖ నిధులతో బోరు మోటారును ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం ఎంపీపీ భర్త హరిశ్చంద్రారెడ్డి, సర్పంచ్ రోస్‌రెడ్డి మోటారును ప్రారంభించారు.

పిచ్చాటూరులో టీడీపీ సంబరాలు

పిచ్చాటూరు, మార్చి 14: సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలాన్ని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అధిష్ఠానం ప్రకటించడంతో నీరువాయి దళితవాడకు చెందిన ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. బాణసంచా పేల్చి మిఠాయిలు పంచారు. ● క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఆదిమూలాన్ని సన్మానించారు. కరివర్దన్, అరుణ్‌ప్రకాష్, మాజీ సర్పంచ్ పద్దురాజు, జయచంద్ర నాయుడు పాల్గొన్నారు.

సొంత ఖర్చుతో పూడికతీత



పిచ్చాటూరు, మార్చి 14: పిచ్చాటూరు మండలం నీరువాయి గ్రామానికి చెందిన సతీష్ తన సొంత ఖర్చులతో అరణియార్ ప్రాజెక్టు నుంచి నీరువాయి చెరువుకు వెళ్లే ప్రధాన కాలువలో పూడిక తీయించారు. దీనిపై రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 14: కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చునని బీసీ హాస్టల్ వార్డెన్ రామయ్య తెలిపారు. మండల కేంద్రంలోని బీసీ హాస్టల్లో పదో తరగతి విద్యార్థులకు గురువారం సరస్వతి పూజ నిర్వహించారు. మంచి మార్కులతో అందరూ ఉత్తమ ఫలితాలు సాధించాలని వార్డెన్ ఆకాంక్షించారు.

ఎస్‌ఐ ధర్మారెడ్డి బదిలీ

రేణిగుంట, మార్చి 14: గాజులమండ్యం ఎస్‌ఐ ధర్మారెడ్డి వడమాలపేటకు బదిలీ అయ్యారు. గురువారం గాజులమండ్యం పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది ఆయనకు సన్మానం చేసి ఘనంగా వీడ్కోలు పలికారు.

పరీక్ష సామగ్రి పంపిణీ



తొట్టంబేడు మండలం పెద్దకన్నలిలో..



వరదయ్యపాళెం మండలం పాండూరులో..

తొట్టంబేడు/ వరదయ్యపాళెం/ శ్రీసిటీ, మార్చి 14: తొట్టంబేడు మండలంలోని పెద్దకన్నలి జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు స్టెప్స్ సంస్థ పథక సంచాలకులు డాక్టర్ ప్రమీలమ్మ గురువారం పరీక్షా సామగ్రి పంపిణీ చేశారు. సంస్థ డైరెక్టర్ సుదాకర్‌రెడ్డి, హెచ్‌ఎం దామోదరం నాయుడు, టీచర్లు మాధవయ్య, పట్టాభి, సునీత, కనకదుర్గ, శివకుమార్, రాధారెడ్డి, విద్యా ర్థులు పాల్గొన్నారు. ● వరదయ్యపాళెం మండలం పాండూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు 'అమ్మానాన్న మెమోరి యల్ ట్రస్టు' ఆధ్వర్యంలో అంబూరుకు చెందిన ఎన్‌ఆర్‌ఐ నందకిషోర్‌రెడ్డి పరీక్షా సామగ్రి వితరణ చేశారు. విమల పాల్గొన్నారు. ● శ్రీసిటీ ఫౌండేషన్ ద్వారా ఇరుగుళం, మాదనపాళెం జడ్పీ హైస్కూళ్లలోని పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ చేశారు. ప్యాడ్, రెండు పెన్నులు, జామెంట్రీ బాక్సు ఫౌండేషన్ ప్రతి నిధులు అందజేశారు. రైటింగ్ ప్యాడ్‌లను శ్రీసిటీ రాక్‌వర్త్ పరిశ్రమ ఇచ్చింది.

చంద్రబాబు, లోకేశ్‌లకు రుణపడి ఉంటా



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిమూలం

సత్యవేడు, మార్చి 14: టీడీపీ అధినేత చంద్రబాబుకు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌కు రుణపడి ఉంటానని సత్యవేడు టీడీపీ అభ్యర్థి ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. టీడీపీ అధిష్ఠానం ఆయనకు టిక్కెట్ ఖరారు చేసిన నేపథ్యంలో గురువారం సత్యవేడులోని స్థానిక వీకేఎన్‌కల్యాణ మండపంలో ఆ పార్టీ నియోజకవర్గ నాయకులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిమూలం మాట్లాడుతూ ఒక దళిత ఎమ్మెల్యేగా ప్రజా సేవలో అంకితమైన తనను వైసీపీ పెద్దలు అవమానకర రీతిలో సాగనంపారని ఆవేదన వ్యక్తం చేశారు. అవమానం భరించలేక బయటికి వచ్చిన తనను టీడీపీ ఆదరించి అభ్యర్థిత్వాన్ని కల్పించిన పార్టీకి ఆజన్మాంతం రుణపడి ఉంటానన్నారు. ఈ ఐదేళ్ల కాలంలో తను తెలిసో, తెలియకో ఏమైనా పొరబాట్లు చేసుంటే మనస్ఫూర్తిగా క్షమించాలని కోరారు. తనది అందరిని కలుపుకుపోయే తత్వమని, ఎవరిని వదులుకోనని స్పష్టం చేశారు. పార్టీలో అందరూ తనకు సమానమేనని, కార్యకర్తలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానన్నారు. అందరం ఒక్క తాటిపైకి వచ్చి పార్టీ విజయం కోసం సైనికుల్లా పని చేద్దామని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించి తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సమావేశంలో నాయకులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, ఇళంగోవన్‌రెడ్డి, శివకుమార్, పరమశివం, బాలరాజు పాల్గొన్నారు.

తిరుమలలో బీఎల్వోల పరిశీలన

తిరుమల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీఎల్వోలు గురువారం తిరుమలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎస్వీ హైస్కూల్‌లోని ఐదు పోలింగ్ బూత్‌లను సెక్టార్ ఆఫీసర్ నాగభూషణం, ఏఎస్ఐ వెంకటముని, బీఎల్వోలు అరుణమ్మ, ప్రతాప్, భాగ్యలక్ష్మి, యుగంధర్ తదితరులు పరిశీలించారు. స్థానికులు నివాసించే బాలాజీనగర్, ఆర్బీ సెంటర్‌లోనూ పర్యటించారు. ఓటర్ల జాబితాను పరిశీలించి పలువురు ఓటర్లతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు.

హ్యూమన్‌రైట్స్, యాంటీ కరెప్షన్ సెల్ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా భువనేశ్వరి



మహిళలకు నియామకపత్రం అందజేస్తున్న అధ్యక్ష కార్యదర్శులు

తిరుపతి అర్బన్, మార్చి 13: ఇండియన్ హ్యూమన్ రైట్స్, యాంటీ కరప్షన్ సెల్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా బి.భువనేశ్వరి, ప్రధాన కార్యదర్శిగా కె.మణిమాల, ఆర్థిక కార్యదర్శిగా బి.హరిత నియమితులయ్యారు. గురువారం స్థానిక కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు కాణిపాకం మురళి, ప్రధాన కార్యదర్శి పి.రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎంపిక చేశారు. వారు మాట్లాడుతూ మానవ హక్కులపై ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు కృషి చేయాలన్నారు. నూతన కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

ఇంటర్ పరీక్షలకు 987మంది గైర్హాజరు

ముగిసిన ప్రథమ సంవత్సర జనరల్ పరీక్షలు

తిరుపతి(విద్య), మార్చి 14 : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పబ్లిక్ పరీక్షలకు గురువారం జిల్లాలో 987మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. జనరల్, ఒకేషనల్ విభాగంలో 33,193మందికిగాను 32,206మంది విద్యార్థులు పరీక్ష రాశారని తెలిపారు. జనరల్‌లో 31,986మందికిగాను 31,181మంది, ఒకేషనల్‌లో 1,207మందికిగాను 1,025 మంది పరీక్ష రాసినట్లు వివరించారు. కాగా ప్రథమ సంవత్సర జనరల్ విభాగ పరీక్షలు గురువారంతో ముగిశాయి.

జర్నలిస్టుల హౌస్‌సైట్స్ అప్లికేషన్స్ వెరిఫికేషన్ ప్రారంభం

తిరుపతి అర్బన్, మార్చి 14 : జర్నలిస్టుల హౌస్‌సైట్స్‌కు సంబంధించిన అప్లికేషన్స్ వెరిఫికేషన్ ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. కలెక్టరేట్ నుంచి తుది జాబితా గత బుధవారం అర్బన్ తహసీల్దార్ కార్యాలయానికి చేరింది. దరఖాస్తుకు ప్రభుత్వం గత జనవరి 6వ తేదీ వరకు అవకాశం కల్పించింది. అయితే అర్హులైన కొందరి దరఖాస్తుల్లో సమస్యలున్నట్లు గుర్తించి, పూర్తిస్థాయిలో సమర్పించాలని ఈనెల 9 నుంచి 16వ తేదీ వరకు గడువు ఇచ్చింది. గడువు పూర్తి కావస్తుండడంతో బుధవారం వరకు అందిన (తిరుపతి అర్బన్ పరిధిలో నమోదు చేసుకున్న 338 జర్నలిస్టులు) తుది జాబితాను ఐ అండ్ పీఆర్ విభాగం అర్బన్ తహసీల్దార్ కార్యాలయానికి చేరవేశారు. సంబంధిత అధికారులు వాటిని పరిశీలిస్తున్నారు.

మాదిగల సమస్యల పరిష్కారానికి కృషి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నేతలు

తిరుపతి(కపిలతీర్థం), మార్చి 14 : మాదిగల సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కన్వీనర్ గిరిధర్, మహిళా కన్వీనర్ ప్రశాంతి కోరారు. వారు గురువారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ మాదిగలను ఓటు బ్యాంకుగా చూస్తున్నారే తప్పా వారికి న్యాయం జరగడం లేదన్నారు. అధికారంలోకి వచ్చిన ఏ పార్టీ కూడా తమ సంక్షేమంపై దృష్టి పెట్టడం లేదన్నారు. కరీంనగర్‌లో బహిరంగ సభకు వస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ న్యాయం చేయాలని కోరారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో మాదిగలకు అధిక సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ నేతలు మురళి, వినోద్‌కుమార్, సుధాకర్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఏడాదికోసారి కిడ్నీ పరీక్ష చేయించుకోండి



కిడ్నీ దినోత్సవంలో మాట్లాడుతున్న స్విమ్స్ డైరెక్టర్ కుమార్

తిరుపతి(వైద్యం), మార్చి 14 : ప్రస్తుత జీవన విధానంలో ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒకసారైనా కిడ్నీ పరీక్ష చేయించుకోవడం సురక్షితమని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ అన్నారు. స్విమ్స్‌లోని శ్రీపద్మావతి ఆడిటోరియంలో ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మానసిక ప్రశాంతతో ఉంటే ఆరోగ్యవంతమైన జీవనం సాగించవచ్చన్నారు. సరైన ఆహారం, ఎక్కువ శాతం నీరు తీసుకోవడం, ఒత్తిడి లేని జీవనంతో కిడ్నీ వ్యాధుల బారిన పడకుండా ఉండొచ్చన్నారు. కిడ్నీ వ్యాధి ఎక్కువై డయాలసిస్‌తో బాధపడే వారికి స్విమ్స్‌లో చక్కటి వైద్యం అందిస్తున్నామన్నారు. కిడ్నీ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లపై ఎంఎస్ డాక్టర్ రామ్ వివరించారు. డీన్ అల్లాడి మోహన్, నెఫ్రాలజీ ప్రొఫెసర్ డాక్టర్ శివకుమార్, డాక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో తప్పిపోయిన సిద్దిపేట్ యువతి



రాజేశ్వరి

తిరుమల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తల్లితో తిరుమలకు వచ్చిన ఓ యువతి తప్పిపోయింది. తెలంగాణాలోని సిద్ధిపేట్ జిల్లా బెజ్జంకు చెందిన డొక్క సారమ్మ తన 24 ఏళ్ల వయస్సు కలిగిన కుమార్తె డొక్క రాజేశ్వరితో కలిసి గతేడాది నవంబరు 13వ తేదీ తిరుమలకు వచ్చింది. దర్శనానంతరం మానసిక వికలాంగురాలైన కుమార్తెతో కలిసి ఆలయం ముందున్న అఖిలాండం వద్దకు చేరుకున్నారు. అక్కడున్న మెట్లపై కూర్చోబెట్టి టీ తీసుకువచ్చేందుకు సారమ్మ వెళ్లింది. తిరిగి వచ్చే సరికి రాజేశ్వరి కనిపించలేదు. దీంతో సారమ్మ పరిసర ప్రాంతాలతో పాటు తిరుమల మొత్తం గాలించింది. ఆచూకీ లభ్యం కాకపోవడంతో సొంతూరుకు చేరుకుని వెతికింది. వారి కుటుంబ సభ్యులు తిరిగి తిరుమలకు చేరుకుని డిసెంబరు 29వ తేదీన తిరుమల పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజేశ్వరి వివరాలు తెలిసిన వారు 81063 56409 నెంబరుకు తెలియజేయాలని ఆమె కోరారు.

సారుంటేనే గేటు తెరుచుకుంటుంది..!



తిరుపతి అర్బన్, మార్చి 14: తిరుపతి అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో వింత వైఖరి నడుస్తోంది. తహసీల్దార్ ఉంటేనే కార్యాలయం ప్రధాన గేటు తెరుస్తున్నారు.. లేకపోతే మూసేస్తున్నారు. దీంతో వివిధ పనుల నిమిత్తం సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఉసూరుమంటూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. కనీసం దిగువస్థాయి అధికారులకు వినతులు సమర్పిద్దామన్నా గేటు తెరవడం లేదు. 'సారు లేరు రేపు రండి' అంటూ సమాధానం ఇస్తున్నారు. గురువారం కూడా అదే పరిస్థితి కనిపించింది. తహసీల్దార్ ఉండడంతో ప్రధాన గేటు తెరిచి ఉంచారు. అర్జీదారులు సారు కారు ఉందా లేదా చూసుకుని మరీ రావాల్సిన పరిస్థితి నెలకొంది. తహసీల్దార్ ఎన్నికల విధుల్లో బిజీగా ఉంటారు కాబట్టి తర్వాత స్థాయి అధికారి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా విద్యుత్సవ్-2కె24

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 14: పద్మావతి యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలో విద్యుత్సవ్-2కె24 ఘనంగా నిర్వహించారు. ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో గురువారం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో రిజిస్ట్రార్ రజని, ఎస్పీడీసీఎల్ మాజీ సీఎండీ గోపాలరెడ్డి, రిటైర్డు ఎస్ఈ దేవేంద్రనాథరెడ్డి, రవండ్స్ ప్లాస్టిక్ సీఈవో దామోదర్ పాల్గొన్నారు. విద్య ద్వారానే విద్యార్థినులు ఉన్నత స్థాయికి చేరుకోగలరని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. సమాజం పట్ల బాధ్యత అలవరుచుకోవాలన్నారు. అనంతరం పేపర్, పోస్టర్ ప్రజెంటేషన్, టెక్నికల్ క్విజ్, డిజైన్ ఎక్స్‌పో, మెగా మెమొరీ, బిక్ ఎక్స్‌పో వంటి పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

రైతుల సమస్యలను పరిష్కరించండి

తిరుపతి(సెంట్రల్), మార్చి 14: రైతుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, వ్యవసాయ రంగంపై తీసుకొచ్చిన నల్ల చట్టాలను రద్దు చేయాలని వామపక్షాల నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం ఢిల్లీలోని రామ్‌లీల మైదానంలో రైతులు చేయబోతున్న ఆందోళనకు మద్దతుగా వామపక్షాల నాయకులు గురువారం పాత మున్సిపల్ కార్యాలయం నుంచి నాలుగు కాళ్ల మండపం వరకు ర్యాలీ నిర్వహించారు. సీపీఎం నేత కందారపు మురళి మాట్లాడుతూ 2021 నుంచి రైతులు ఆందోళనలు చేస్తున్నా నల్ల చట్టాలను రద్దు చేయకపోవడం బాధాకరమన్నారు. 700 మంది రైతులు మృతి చెందినా బీజేపీ ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమని మండిపడ్డారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులను ఎందుకు అమలు చేయడంలేదని ప్రశ్నించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రైతులు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సి.పెంచలయ్య, పి.హేమలత, కె.విజయ్‌కుమార్, ఆర్.వెంకయ్య, ఎన్‌డి.రవి, కెవై రాజా, కె.వేణుగోపాల్, టి.సుబ్రమణ్యం, సాయిలక్ష్మి, జయంతి తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ ఫలితాల్లో విశ్వం విద్యార్థుల హవా

టాపర్లుగా ఆరాధ్య, శశాంక్



విద్యార్థులతో విశ్వచందన్‌రెడ్డి, విశ్వతులసి

తిరుపతి(రూరల్),మార్చి14: జాతీయ స్థాయిలో సైనిక్ విద్యాలయాల్లో 6, 9 తరగతుల్లో ప్రవేశాల కోసం ఈ ఏడాది జనవరి 28న నిర్వహించిన సైనిక్ ప్రవేశ పరీక్ష ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) బుధవారం రాత్రి విడుదల చేసింది. తిరుపతి వరదరాజనగర్‌లో ఉన్న విశ్వం స్కూల్ విద్యార్థులు గతంలో లాగే ఈ ఏడాది కూడా అత్యుత్తమ ఫలితాలను సాధించి హవా కొనసాగించారని స్కూల్ చైర్మన్, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. తమ వద్ద శిక్షణ పొందిన 237మంది విద్యార్థులు అర్హత సాధించారని తెలిపారు. 6వ తరగతి ప్రవేశ పరీక్షల్లో ఆరాధ్య 300కి 275మార్కులు, 9వ తరగతి ప్రవేశ పరీక్షల్లో శశాంక్ 400కి 352మార్కులు, లోచన్ 336మార్కులతో టాపర్లుగా నిలిచారని పేర్కొన్నారు. రిషిత, నితీష్‌రెడ్డి, వెనిష్‌రెడ్డి, పద్మినిరెడ్డి, ఆర్యన్‌రెడ్డి, జయసూర్య, సాయికుమార్, సాకేత్, లిశ్వంత్, భరత్, అయాన్, మహిధర్, రసజ్ఞ, దీక్షిత్, సుధంశ్, లిఖిత, గంగాజైదీప్, సాత్విక్, హరిచరణ్, పూజ, ట్వింకిల్ రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు. విద్యార్థులను కరస్పాండెంట్ తులసి విశ్వనాథరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, విశ్వశ్రీ, టీచర్లు అభినందించారు.

17వరకు గ్రహణమొర్రి శస్త్ర చికిత్సలు

తిరుపతి(వైద్యం), మార్చి 14 : రుయాస్పత్రిలో అందిస్తున్న సూపర్ స్పెషాలిటీ వైద్య సేవల్లో భాగంగా ఈనెల 13నుంచి 17వ తేదీ వరకు ఆస్పత్రిలో గ్రహణమొర్రి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నట్లు సూపరింటెండెంట్ రవిప్రభు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రహణ మొర్రితో బాధపడుతున్న చిన్నారులకు ప్లాస్టిక్ సర్జరీ, అనస్థీషియా విభాగాల ఆధ్వర్యంలో ఉచిత శస్త్ర చికిత్స నిర్వహిస్తున్నామని వివరించారు. ఇప్పటికే 32 మంది చిన్నారులను గుర్తించామని, వీరిలో 30 మందికి తొలివిడతలో శస్త్ర చికిత్స చేస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శస్త్ర చికిత్స అనంతరం జగనన్న ఆసరా పథకం కింద లబ్ధి చేకూరుతుందని తెలిపారు.

భక్తుడికి బంగారు గొలుసు అప్పగింత



భక్తుడికి బంగారు గొలుసు అందజేస్తున్న విజిలెన్స్ అధికారులు

తిరుమల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చి జారవిడుచుకున్న బంగారు గొలుసును విజిలెన్స్ అధికారులు తిరిగి భక్తుడికి అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన ఓ భక్తుడు శ్రీవారి దర్శనం కోసం గురువారం తిరుమలకు వచ్చారు. ఉదయం 8 గంటలకు ప్రధాన కల్యాణకట్టకు వెళ్లి తలనీలాలు సమర్పించారు. తలను శుభ్రపరుచుకునే సమయంలో దాదాపు రూ.2 లక్షల విలువైన బంగారు గొలుసును జారవిడుచుకున్నారు. గుర్తించిన కల్యాణకట్ట ఉద్యోగి వంకీపురం పవన్ విజిలెన్స్ అధికారులకు అందజేశారు. కొంత సమయం తర్వాత గొలుసు పోయిందంటూ వచ్చిన భక్తుడి నుంచి వివరాలు సేకరించి నిర్ధారించుకున్న తర్వాత విజిలెన్స్ వీఎస్వో నందకిషోర్, ఏవీఎస్వో శైలేంద్ర తిరిగి గొలుసును అందజేశారు. దీంతో భక్తుడు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రూప్-1 పోస్టులను అమ్మేసిన జగన్ రెడ్డి రాజీనామా చేయాలి

తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ రాస్తారోకో



తిరుపతి, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : గ్రూప్-1 పోస్టులను జగన్మోహన్‌రెడ్డి అమ్మేశారంటూ తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో తిరుపతిలో ఆందోళన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. దీంతో కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది. తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు మాట్లాడుతూ ఇసుక, మద్యం, మైన్స్, భూమి...ఇలా పంచభూతాలన్నింటినీ జగన్ రెడ్డి దోచుకున్నాడని ఆరోపించారు. నిరుద్యోగులకు అన్యాయం చేసే విధంగా గ్రూప్-1 పోస్టుల్లోనూ దోచుకోవడం దారుణమంటూ మండిపడ్డారు. గ్రూప్-1 పోస్టులను అమ్ముకున్న సీఎం రాజీనామా చేయాలని, గౌతమ్ సవాంగ్, సీతారామాంజనేయులపై వెంటనే సీబీఐ విచారణ జరిపించాలని డిమాండు చేశారు. ఒక్కొక్క పోస్టును రూ.ఒకటిన్నర కోటి నుంచి రూ.2కోట్ల వరకు అమ్ముకుని ఉద్యోగాలు ఇచ్చి అర్హులకు అన్యాయం చేశారని ఆరోపించారు. నిరుద్యోగులకు న్యాయం జరిగేవరకు ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షుడు హేమంత్ రాయల్, రాష్ట్ర కార్యదర్శి ఆర్.పి.శ్రీనివాసులు, అధికార ప్రతినిధి తోట వాసు, నాయకులు కృష్ణయాదవ్, కరణం సందీప్, పత్తిపాటి వివేక్, శ్రీనివాస్ యాదవ్, రఫీ శ్రీరామ్ బాబి, కోబాక లక్ష్మణ్, గోపి, దిలీప్ రాయల్ ,లోకేష్ రాయల్, సాయి, శివ, నాగరాజు, వెంకట్ రెడ్డి, గుణ తదితరులు పాల్గొన్నారు.

టీఎన్ఎస్ఎఫ్ నేత అరెస్టు, విడుదల



తిరుపతి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : గ్రూప్-1 పోస్టుల వివాదంపై నిరసన తెలిపిన టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు కొట్టే హేమంత్ రాయల్‌ను శుక్రవారం సాయంత్రం పోలీసులు అదుపులోకి తీసుకుని ఎస్వీ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించారు. రాత్రి 9 గంటల ప్రాంతంలో వ్యక్తిగత పూచీకత్తుపై విడిచిపెట్టారు. ఆయన మాట్లాడుతూ టీపీఎస్సీ పోస్టుల కుంభకోణం వల్ల మెరిట్ పొందిన నిరుద్యోగులకు జరిగిన నష్టం వల్ల తెలంగాణ సమాజం కేసీఆర్‌కు ప్రజాకోర్టు శిక్ష వేసిందని, అలాగే ఏపీ ప్రజానీకం జగన్ రెడ్డికి శిక్ష వేస్తుందని అన్నారు. జగన్‌కి ఏమాత్రం నైతిక విలువలు ఉన్నా తక్షణమే రాజీనామా చేయాలని డిమాండు చేశారు.

మధ్య తరగతి వర్గంలో విలువలు కనుమరుగు

ప్రముఖ చరిత్రకారుడు వకుళాభరణం రామకృష్ణ ఆందోళన



సదస్సులో ప్రసంగిస్తున్న వకుళాభరణం రామకృష్ణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 14: చరిత్రలో కీలక భూమిక పోషించిన మధ్య తరగతి వర్గంలో ప్రస్తుతం విలువలు, సామాజిక బాధ్యత కనుమరుగైందని ప్రముఖ చరిత్రకారుడు ప్రొఫెసర్ వకుళాభరణం రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. పౌర చైతన్య వేదిక ఆధ్వర్యంలో తెలుగు సమాజం - ఆధునికత అంశంపై ఎస్వీ యూనివర్సిటీ ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. మధ్య తరగతి వర్గం అవినీతిలో భాగమైందని అభిప్రాయపడ్డారు. 19వ శతాబ్దంలో సామాజిక మార్పు కోసం మధ్య తరగతి వర్గమే కృషి చేసిందని గుర్తు చేశారు. ఇవాళ ఇలాంటి పాత్రను ఆ వర్గం పోషించలేకపోతోందన్నారు. కుల, భూస్వామ్య వ్యవస్థలు నేటికీ సమాజాన్ని పీడిస్తున్నాయని అన్నారు. కుల, మత ప్రభావాలు పోనంతకాలం మన దేశం అభివృద్ధి చెందదని ఆనాడే అంబేడ్కర్ అన్నారని గుర్తు చేశారు. పలువురు విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు వకుళాభరణం సమాధానాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో పౌర చైతన్య వేదిక అధ్యక్ష, కార్యదర్శులు వాకా ప్రసాద్, కుమార్‌రెడ్డి, కోశాధికారి హరీష్, సీనియర్ జర్నలిస్టు రాఘవశర్మ, అరసం రాష్ట్ర అధ్యక్షవర్గ సభ్యుడు సాకం నాగరాజ, ఆఫీసర్స్ క్లబ్ చైర్మన్ తమటం రామచంద్రారెడ్డి, తెలుగు విభాగాధిపతి రాజేశ్వరమ్మ, కవి గొడుగుచింత గోవిందయ్య, డాక్టర్ బాలాజీ, డాక్టర్ నాగలూరి దయాకర్, డాక్టర్ డి.గోవిందులు, రిటైర్డు సోషియాలజీ ప్రొఫెసర్ డి.వేంకటేశ్వర్లు, ప్రేమావతి పాల్గొన్నారు.

తిరుమలలో ఎన్ఎస్‌జీ బృందాలు



సేవాసదన్ వద్ద ఎన్ఎస్‌జీ సిబ్బంది

తిరుమల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తిరుమలకు కట్టుదిట్టమైన భద్రతను కల్పించడంలో భాగంగా గురువారం సాయంత్రం ఎన్ఎస్‌జీ (నేషనల్ సెక్యూరిటీ గార్డ్) బృందాలు చేరుకున్నాయి. శ్రీవారి దర్శనార్థం ప్రముఖులతోపాటు వేలాది మంది భక్తులు తిరుమలకు వస్తుంటారు. వారికి భద్రత పెంచడం కోసం టీటీడీ కొన్ని రోజుల క్రితం హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీష్ కుమార్ గుప్తా ఆధ్వర్యంలో చర్చలు జరిపిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే తిరుమల భద్రత విషయంలో ఎన్ఎస్‌జీని భాగస్వామ్యం చేశారు. మాక్‌డ్రిల్ నిమిత్తం ఎన్ఎన్‌జీ బృందాలు గురువారం సాయంత్రం తిరుమలకు చేరుకున్నాయి. శ్రీవారిసేవా సదన్ వద్ద సమావేశమై యాక్షన్ ప్లాన్‌పై చర్చించారు. ఆక్టోపస్, పోలీస్, విజిలెన్స్ విభాగాలతో కలిసి అర్ధరాత్రి ఆలయం వద్ద డ్రిల్ నిర్వహించనున్నారు.

తిరుమలలో వేడుకగా 'చిల్ విత్ అవర్ చిక్స్'

ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శనలు



డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

తిరుమల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తిరుమల ఎస్వీ హైస్కూల్‌లో 'చిల్ విత్ అవర్ చిక్స్' కార్యక్రమం గురువారం వేడుకగా నిర్వహించారు. ఎస్వీ హైస్కూల్ వార్షికోత్సవం సందర్భంగా ఎల్‌కేజీ నుంచి మూడవ తరగతి వరకు విద్యార్థులకు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులు క్రమశిక్షణగా ఉండి నృత్య ప్రదర్శనలు ఇచ్చి అందర్నీ ఆకట్టుకున్నారు. ఏప్రిల్ 1వ తేదీన 4నుంచి పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్టు పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఈ కార్యక్రమంలో సింఘానియా ఎడ్యుకేషనల్ ట్రస్టు ఉపాధ్యాయురాలు రంగలక్ష్మి, ఇతర ఉపాధ్యాయులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రవినాయుడు హౌస్ అరెస్టు



రవినాయుడుకు నోటీసులు అందజేస్తున్న పోలీసులు

తిరుపతి (రవాణా), మార్చి 14 : తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడును గురువారం రాత్రి అలిపిరి పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఏపీపీఎస్సీలో జరిగిన అక్రమాలపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇల్లు ముట్టడిస్తారన్న కారణంతో హౌస్ అరెస్టు చేస్తున్నట్లు పోలీసులు ఆయనకు నోటీసులు అందజేశారు. రవినాయుడు మాట్లాడుతూ తాము ఎలాంటి ముట్టడి కార్యక్రమానికీ పిలుపు ఇవ్వలేదని, ఆ కారణం చూపి హౌస్ అరెస్టు చేయడం సబబు కాదని అన్నారు. శుక్రవారం చిలకలూరిపేటలో పార్టీకి సంబంధించి మీటింగ్ ఉందని చెబుతున్నా పట్టించుకోకుండా హౌస్ అరెస్టు చేయడం దారుణమన్నారు. విషయం తెలుసుకున్న టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత నేతలు తిమ్మినాయుడుపాళెం సమీపంలోని ఆయన స్వగృహం వద్దకు చేరుకున్నారు. పోలీసులు వారిని అక్కడి నుంచి పంపించివేశారు.

'శత'క్కొట్టిన మస్తాన్



తిరుపతి(క్రీడలు), మార్చి 14: టీటీడీ ఉద్యోగుల వార్షిక క్రీడల్లో భాగంగా స్థానిక వెటర్నిటీ యూనివర్సిటీ మైదానంలో గురువారం ఉదయం టీ 20మ్యాచ్ నిర్వహించారు. జేటీఎంపై ఈటీం విజయం సాధించింది. విజేత జట్టు తొలుతగా బ్యాటింగ్ చేయగా కెప్టెన్ మస్తాన్ కేవలం 66 బంతుల్లో 143 రన్స్ కొట్టి శభాష్ అనిపించాడు. టీటీడీ చరిత్రలో ఇంతటి వ్యక్తిగత స్కోరు చేయడం ఇదే తొలిసారి. జట్టును గెలిపించడమే కాకుండా సెమీఫైనల్స్‌కు చేర్చిన ఘనత ఆయనకే దక్కింది.

యంగ్ జీనియస్ అవార్డులకు బీవీకే విద్యార్థుల ఎంపిక



విద్యార్థులతో సీఈవో అలేఖ్యరెడ్డి

తిరుపతి(రూరల్), మార్చి 14: హథీరాంజీ కాలనీలో ఉన్న బీవీకే గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్‌లో చదివే పలువురు విద్యార్థులు సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డులకు ఎంపికైనట్లు ఏజీఎం చంద్రారెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన సుచరిండియా ఫౌండేషన్ నిర్వహించిన ప్రతిభా పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో వీపీ రిధివర్షిని(8వతరగతి), జె.సాయి(9వతరగతి) ప్రథమస్థానం సాధించగా.. అనంత్‌రెడ్డి, హాసిత్ వెంకటరమణ, నేహశ్రీ, శరవణ, ప్రణీత్, సుజిత్, నాగచైతన్య, ప్రణతి, కేతన్‌కార్తీక్, చరణ్‌తేజ్, నితీష్‌లు జిల్లాస్థాయిలో ప్రథమస్థానం, ఉమర్ ఫరూక్, పూర్ణశంకర్, కార్తీక్, మధుసూదన్, సుజిత్, నాగచైతన్య ద్వితీయ స్థానంలో నిలిచారని వివరించారు. కాగా ఏప్రిల్ న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో అవార్డులను అందుకోనున్నారు. విద్యార్థులను సీఈవో అలేఖ్యరెడ్డి, టీచర్లు అభినందించారు.

20న టీటీడీ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ బ్యాంకు జీఎం పోస్టుకు వాక్ ఇంటర్వ్యూ

తిరుపతి అర్బన్, మార్చి 14: టీటీడీ ఎంప్లాయీస్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్‌లో జనరల్ మేనేజర్ పోస్టుకు ఈనెల 20న ఉదయం 11 గంటలకు వాక్‌ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు బ్యాంకు అధ్యక్షుడు చీర్లకిరణ్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కోఆపరేటివ్ డిపార్ట్‌మెంటులో డిప్యూటీ, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసి, వయస్సు 65 సంవత్సరాల లోపు ఉన్నవారు అర్హులని తెలిపారు. నెలజీతం రూ.30వేలు. ఉంటుందని, మరిన్ని వివరాలకు 9989033100, 9989759044లను సంప్రదించాలని కోరారు.

రష్ ఆస్పత్రిలో ఘనంగా కిడ్నీ దినోత్సవం



మాట్లాడుతున్న రష్ ఆస్పత్రి అధినేత డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం

తిరుపతి (వైద్యం), మార్చి 14 : చక్కటి ఆరోగ్యానికి కిడ్నీలు కీలక పాత్ర పోషిస్తాయని రష్ ఆస్పత్రి అధినేత, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం అన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా తిరుపతి రష్ ఆస్పత్రిలో ఆయన గురువారం కిడ్నీ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కిడ్నీ వ్యాధులను నియంత్రించడానికి అవగాహన ప్రధానమన్నారు. కిడ్నీల పనితీరు బాగుంటేనే శరీరంలోని అన్ని అవయవాలు బాగుంటాయని, ఆ విషయాన్ని గుర్తు పెట్టుకొని కిడ్నీ రక్షణకు తగిన జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు గౌరీమదన్, కృష్ణకాంత్, లీలావతి మదన్, తేజశ్రీ, చందన్‌కుమార్, బాబు, శివకుమార్ పాల్గొన్నారు.

మార్క్స్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళతాం

తిరుపతి సెంట్రల్, మార్చి 14 : దోపిడీ లేని సమాజ నిర్మాణానికి కృషి చేసిన కారల్ మార్క్స్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళతామని సీపీఎం నాయకులు కె.మురళి పేర్కొన్నారు. యశోదనగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం కారల్‌మార్క్స్ 141 వర్ధంతిని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సమసమాజ స్థాపన కోసం కారల్ మార్క్స్ మార్క్సిజం సిద్ధాంతాన్ని తీసుకొచ్చారన్నారు. దీన్ని గ్రామీణ స్థాయికి తీసుకెళ్లి ప్రజలను చైతన్యపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుబ్రమణ్యం, వేణుగోపాల్, రవి, వెంకటప్ప, ఖాదర్‌వల్లి పాల్గొన్నారు.

సీపీఐ కార్యాలయంలో : బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయంలో గురువారం సీపీఐ నాయకులు కారల్‌మార్క్స్ చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు సి.పెంచలయ్య, లాజర్, హరికృష్ణ, శ్రీరాములు పాల్గొన్నారు.

ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్‌పై అవగాహన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 14: ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ అంశంపై పద్మావతి మహిళా యూనివర్సిటీలో అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. వీసీ భారతి, రిజిస్ట్రార్ రజని పాల్గొని మాట్లాడారు. మేధో హక్కులను కాపాడుకోవడం ద్వారా మంచి గుర్తింపు లభించే అవకాశం ఉంటుందన్నారు. యూనివర్సిటీ అధ్యాపకులు, పరిశోధకులు ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ గురించి అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. విశాఖ గీతం వర్సిటీ అధ్యాపకులు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ విజ్ఞాన రంగంలో ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ గురించి తెలుసుకోవాలన్నారు.

ప్రొఫెసర్ ఎస్డీఎస్ మూర్తికి బెస్ట్ రీసెర్చ్ అవార్డు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 14 : ఎస్వీ యూనివర్సిటీ బయోకెమిస్ట్రీ విభాగ ప్రొఫెసర్ ఎస్డీఎస్ మూర్తి బెస్ట్ రీసెర్చ్ అవార్డు పొందారు. లక్నోకు చెందిన సొసైటీ ఆఫ్ అగ్రికల్చర్ ఈ అవార్డును అందించింది. 32 సంవత్సరాలుగా బయో కెమిస్ట్రీ రంగంలో ఆయన చేస్తున్న బోధన, పరిశోధన కృషికి గుర్తింపుగా ఈ అవార్డును పొందారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును కూడా పొందారు. ఆయన్ను వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్‌రెడ్డి అభినందించారు. రిజిస్ట్రార్ హుస్సేన్, డీన్ పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంలో మెళకువలతో లాభాలు



మాట్లాడుతున్న ఏడీఆర్ డాక్టర్ రమణ, పక్కనే ఏడీ ప్రభాకర్‌రెడ్డి

తిరుపతి(రూరల్), మార్చి 14: తేనెటీగల పెంపకంలో మెళకువలపై అవగాహన పెంచుకుంటే మంచి లాభాలు ఆర్జించవచ్చని ఎస్వీ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి.ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో హైదరాబాద్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మైక్రోస్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజస్ ఆధ్వర్యంలో తేనెటీగల పెంపకంపై నిర్వహించిన రెండ్రోజుల రాష్ట్రస్థాయి సదస్సు గురువారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ తేనె ఉత్పత్తిదారుల సంఘాన్ని ఏర్పరచుకుని పరిశ్రమ అభివృద్ధితోపాటు లాభాలు పొందాలని సూచించారు. అధ్యక్షత వహించిన ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ సి.రమణ మాట్లాడుతూ తేనెటీగల పెంపకం శ్రమతో కూడుకున్నదని, జాగురూకత లేకపోతే నష్టాలను చవిచూడాల్సి వస్తుందని తెలిపారు. తేనెలోని ఔషధగుణాలు, ఉపయోగాలు, వివిధ ఉత్పత్తులను వివరించారు. చీని, నిమ్మ పరిశోధనా స్థానం హెడ్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి.నాగరాజు మాట్లాడుతూ స్వచ్ఛమైన తేనె తయారుచేసి ప్రభుత్వం నుంచి ధ్రువీకరణ పొందడం ద్వారా అధిక రాబడి పొందవచ్చన్నారు. హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ దశరథరామిరెడ్డి మాట్లాడుతూ రైతు ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసి సన్నకారు వ్యాపారస్తులతో సంధి చేసుకోవడం ద్వారా ఉత్పత్తులను అధిక ధరలకు అమ్ముకోవచ్చని తెలిపారు. ఆర్ఏఆర్ఎస్ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ పి.సుధాకర్, ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ మోహన్‌రావు, డాక్టర్ మంజునాథ్, రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.వెంకటరెడ్డి, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు చెందిన రైతులు, ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ సభ్యులు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, కేవీకే ఏరువాక కేంద్రాల శాస్త్రవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

● **నోరూరించే తేనెల ప్రదర్శన :** తేనెటీగల పెంపకం, ఉత్పత్తిలో 10 సంవత్సరాలకు పైగా అనుభవం ఉన్న నంధ్యాల జిల్లా అవుకుకి చెందిన వెలుగు రమేష్ ఫార్మర్స్ హనీ, గుంటూరుకు చెందిన మోహన్ హనీబీస్ సంస్థ ఆధ్వర్యంలో పలు రకాల తేనెలను ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. తమ ఉత్పత్తులను ప్రదర్శించి అనుభవాలను రైతులు, విద్యార్థులతో పంచుకున్నారు. 20 ఎకరాలకు పైగా పొలమున్న పలు పంటలలో(నువ్వులు, ఆవాలు, ధనియాలు, నేరేడు, నిమ్మ, వాము, సోంపు వంటి) తేనెటీగల ద్వారా 52 రకాల తేనెలను రూపొందించవచ్చని ఎగ్జిబిట్ చేశారు. ఆసక్తి ఉన్న ఔత్సాహికులకు ఉచిత శిక్షణ ఇస్తామని, ఇతర వివరాల కోసం 9666957666ను సంప్రదించాలని కోరారు. కాగా ఈ ప్రదర్శన శుక్రవారం కొనసాగనుంది. ప్రదర్శనతోపాటు పలు రకాల తేనెలను అమ్ముతున్నారు.

‘స్థానికులతో 75శాతం ఉద్యోగాల భర్తీ’ని రద్దు చేయండి

» హైకోర్టులో వ్యాజ్యం.. ప్రభుత్వాలకు ధర్మాసనం నోటీసులు

అమరావతి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పరిశ్రమలు, కర్మాగారాలలో 75శాతం ఉద్యోగాలను స్థానికులతో భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు సమర్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశిస్తూ వారికి నోటీసులు జారీ చేసింది. విచారణను మూడువారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం ఇటీవల ఆదేశాలిచ్చింది. రాష్ట్రంలోని పరిశ్రమలు, కర్మాగారాలలో 75శాతం ఉద్యోగాలను స్థానికులతో భర్తీ చేయాలని 2019లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాన్ని సవాల్ చేస్తూ ఏపీ టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్, వసంత ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి.

వెంకట్రామిరెడ్డిని నిలదీసిన సచివాలయ ఉద్యోగులు!

అమరావతి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా ఉండి ఇక్కడి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుండా.. బయట ప్రభుత్వానికి అనుకూలంగా ప్రచారం చేయడం తగదని సచివాలయ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డిని పలువురు ఉద్యోగులు నిలదీశారు. అమరావతి సచివాలయంలోని ఐదో బ్లాక్‌లో సచివాలయ ఉద్యోగుల సంఘం(అప్సా) జనరల్ బాడీ సమావేశం వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సమావేశంలో పలువురు ఉద్యోగులు బకాయిల గురించి, ఇతర సమస్యల పరిష్కారం గురించి వెంకట్రామిరెడ్డిని ప్రశ్నించారు. ప్రభుత్వ అనుకూల ప్రచారంపై గిట్టని వాళ్లు తన పై ప్రచారం చేస్తున్నారని వెంకట్రామిరెడ్డి సమర్థించుకునే ప్రయత్నం చేయగా.. ‘మీరు మాట్లాడిన వీడియోలు, వాయిస్‌లు ఉన్నాయి కదా’ అంటూ ఉద్యోగులు నిలదీయడంతో కాకర్ల నీళ్లు నమిలినట్లు సమాచారం. సచివాలయ ఉద్యోగుల బకాయిలు ఈ నెల 31 తేదీకి నాటికి చెల్లించేలా చూస్తానని, నెలాఖరుకు ఇళ్ల స్థలాలు ఇచ్చేలా చూస్తానని, మిగతా వారికి తర్వాత చూస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది.

ఔట్ సోర్సింగ్‌కు ప్రత్యేక సర్వీస్ రూల్స్ ఉండాలి

అమరావతి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక సర్వీసు రూల్స్‌ను ఏర్పాటు చేయాలని, సీనియారిటీని బట్టి ప్రతి ఏటా వేతనాన్ని కనీసం ఐదు శాతం పెంచాలని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఏపీ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సుమన్, సురేష్ డిమాండ్ చేశారు. గురువారం అమరావతి సచివాలయంలో ప్రభుత్వ ఆర్థికశాఖ కార్యదర్శి(హెచ్ఆర్) చిరంజీవి చౌదరి, ఆధ్వర్యంలో జరిగిన అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో పలు సమస్యలను బొప్పరాజు.. చిరంజీవి చౌదరి దృష్టికి తీసుకెళ్లారు.

జగన్ గిరిజన ద్రోహి: కొండా

అమరావతి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఉద్యోగులు దాచుకున్న జీపీఎఫ్ సొమ్ములను సైతం వారికి తెలియకుండా దోచుకున్న గిరిజన ద్రోహి జగన్ అని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు కొండా నరహరి వరప్రసాద్ విమర్శించారు. సెక్రటేరియట్ ఉద్యోగులకు 30 నుంచి 24 శాతానికి, ఇతర ఉద్యోగులకు 20 శాతం నుంచి 16 శాతానికి హెచ్ఆర్‌ను తగ్గించి ప్రభుత్వం ఉద్యోగులకు తీరని అన్యాయం చేశారని పేర్కొన్నారు.

గురుకులాల డైట్ బిల్లులు విడుదల చేయాలి

ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గిరిజన గురుకులాలు, గిరిజన సంక్షేమ వసతి గృహాలకు 4 నెలలుగా పెండింగ్‌లో ఉన్న డైట్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ చైర్మన్ అక్కులప్ప నాయక్ గిరిజన సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండేను కోరారు.

వలంటీర్ల ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దు: షరీఫ్

అమరావతి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఓటమి భయంతోనే జగన్‌రెడ్డి వలంటీర్లతో ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తున్నాడని టీడీపీ సీనియర్ నేత ఎంఏ షరీఫ్ ఆరోపించారు. గురువారం టీడీపీ జాతీయ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ... టీడీపీ అధికారంలోకి వస్తే, సంక్షేమ పథకాలు నిలిపివేస్తారంటూ వైసీపీ నేతలు ప్రచారం చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. వలంటీర్లు చెప్తున్నట్లు సంక్షేమ పథకాలు రద్దవుతాయని ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

4జీ టవర్ల ఏర్పాటును వేగవంతం చేయాలి: కేంద్రం

అమరావతి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా మారుమూల గ్రామాలకు యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్ ద్వారా 4జీ సేవలను అందుబాటులోకి తెస్తామని కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్‌గౌబ తెలిపారు. ఇందుకు సంబంధించిన పనుల ప్రగతిపై గురువారం ఢిల్లీ నుంచి రాష్ట్రాల సీఎస్‌లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

8 సహకార సంఘాలకు ఎన్సీడీసీ అవార్డులు

అమరావతి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్సీడీసీ) రీజనల్ కోఆపరేటివ్ ఎక్స్‌లెన్స్, మెరిట్ అవార్డులు-2023కు రాష్ట్రంలోని 8 సహకార సంఘాలు ఎంపికయ్యాయి. కానూరు ఎల్ఏసీఎస్, పులుగుర్త చేనేత సహకార సంఘం, జంగావారిపల్లె, కుప్పం మహిళా డెయిరీ సహకార సంఘాలు ఎక్స్‌లెన్స్ అవార్డులు పొందగా, తిమ్మసముద్రం, దిమిలి పీఏసీఎస్‌లు, రంగాయపాలెం, పెదభరణపల్లె మహిళా డెయిరీలకు మెరిట్ అవార్డులు దక్కాయని ఎన్సీడీసీ రీజనల్ డైరెక్టర్ వంశీ గురువారం తెలిపారు. మంగళగిరిలోని రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య కార్యాలయంలో సహకార శాఖ కార్యదర్శి అహ్మద్‌బాబు ఆయా సంఘాలకు ఈ అవార్డులను అందజేశారు.

ఆస్తుల జప్తునకు అనుమతి ఇవ్వండి

» ఫైబర్ కేసులో సీఐడీ పిటిషన్ దాఖలు

విజయవాడ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఫైబర్‌నెట్ కేసులో నిందితులుగా ఉన్నవారి ఆస్తుల జప్తునకు అనుమతివ్వాలని సీఐడీ అధికారులు విజయవాడ ఏసీబీ కోర్టులో గురువారం పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో ఏ1గా టీడీపీ అధినేత చంద్రబాబు ఉన్నారు. ఏ2గా వేమూరి హరికృష్ణ ప్రసాద్, ఏ3గా తుమ్మల గోపీచంద్, ఏ4గా టెర్రాసాఫ్ట్ కంపెనీ డైరెక్టర్, ఏ11గా వీఎల్ఎస్ విప్లవ్ కుమార్, ఏ13గా విజయ్‌కుమార్ రామ్మూర్తి, ఏ14గా రామ్‌కుమార్ మూర్తి, ఏ18గా కనుమూరి కోటేశ్వరరావు ఆస్తులను జప్తు చేయడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. మొత్తం రూ.17.75 కోట్ల విలువజేసే ఆస్తులను జప్తు చేయాలని కోర్టును అభ్యర్థించారు. ఈ నిందితులంతా కలసి ప్రభుత్వ ఖజానాకు రూ.114.53 కోట్ల నష్టం కలిగించారని పిటిషన్‌లో పేర్కొన్నారు.

షరతులతో గ్రేడ్-2 వీఆర్వోలకు ప్రొబేషన్

అమరావతి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): గ్రామ సహాయకుడి (వీఆర్ఏ) నుంచి గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్ఓ)గా పదోన్నతి పొందిన వారి ప్రొబేషన్‌ను ప్రకటిస్తూ రెవెన్యూశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఏడాదిలోగా సర్వే, ఇతర పరీక్షలు పాసవ్వాలని షరతు విధిస్తూ ప్రొబేషన్ ప్రకటించింది. సర్వే అంశాలపై రాత పరీక్షకు రెగ్యులర్ షెడ్యూల్ విడుదల చేయాలని సర్వేకమిషనర్‌ను ఆదేశించింది.

సాగు రంగంలో స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ 20% పెంపుదల

అమరావతి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వ్యవసాయ, అనుబంధ రంగాలల్లో 20రకాల పంటలకు 2024-25లో స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను 2023-24 కన్నా 20% పెంపుదలకు రాష్ట్ర స్థాయి సాంకేతిక కమిటీ ఆమోదం తెలిపింది. గురువారం మంగళగిరిలోని వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయంలో కమిటీ సమావేశం జరిగింది. ప్రధానంగా వచ్చే ఖరీఫ్‌లో వరికి రూ. 42,000-46,000 రబీలో వరికి రూ.45,000- 49,000, మొక్కజొన్నకు రూ.42,000- 45,000, పచ్చి మిర్చికి రూ.90,000-95,000, ఎర్రమిర్చి రూ.1,15,000-1,25,000, చెరకుకు రూ.90,000- 1,00,000, ఆయిల్‌పామ్‌కు రూ.70,000-75,000, హైబ్రిడ్ టమాటాకు రూ.95వేల నుంచి రూ.లక్షా15వేలు, ప్లాంటేషన్ అరటికి రూ.90వేల నుంచి రూ.లక్ష, టిష్యూ కల్చర్ అరటికి రూ.1,15,000- 1,30,000, మల్బరీకి రూ.1,00,000-1,10,000, తిలాపియా చేపల సాగుకు రూ.4,20,000-5,00,000, వనామీ రొయ్యలకు రూ.6 నుంచి రూ.7లక్షలు, వనామీ ప్రోత్సాహకం రూ.9నుంచి రూ.10లక్షలుగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను నిర్ణయించారు.

ఇద్దరు ఐఏఎస్ అధికారుల బదిలీ

అమరావతి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇద్దరు ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభమ్ బన్సాల్‌ను శాప్ ఎండీగా బదిలీ చేసింది. ఆయన స్థానంలో 2017 బ్యాచ్‌కు చెందిన శాప్ ఎండీ హెచ్.ఎం.ధ్యాన్‌చంద్‌ను నియమించింది. ధ్యాన్‌చంద్ విలేజ్ అండ్ వార్డు సచివాలయాల డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన బదిలీ కావడంతో ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా ఎం.శివప్రసాద్‌కు సచివాలయాల డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. కాగా, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవికి వాసిరెడ్డి పద్మ రాజీనామాకు ప్రభుత్వం గురువారం ఆమోదం తెలిపింది.

సీఏఏ వివక్షాపూరితం

ఐరాస, ఆమ్నెస్టీ, అమెరికా అభ్యంతరాలు

వాషింగ్టన్, మార్చి 14: కేంద్ర ప్రభుత్వం ఇటీవల అమలులోకి తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై ఐక్యరాజ్యసమితి, ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్, అమెరికా ప్రభుత్వం తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేశాయి. సీఏఏ ప్రాథమికంగానే వివక్షతో కూడుకున్న చట్టమని, అంతర్జాతీయంగా భారత్ కట్టుబడి ఉన్న మానవహక్కుల ఒప్పందాలను ఇది ఉల్లంఘిస్తుందని.. 2019లో సీఏఏ చట్టాన్ని చేసినప్పుడే తమ ఆందోళనను వెలిబుచ్చామని ఐరాస మానవ హక్కుల హైకమిషనర్ కార్యాలయం ప్రతినిధి తెలిపారు. అంతర్జాతీయ మానవ హక్కుల చట్టానికి అనుగుణంగా సీఏఏ ఉందా? అన్నదానిని పరిశీలిస్తున్నామన్నారు. అమెరికా ప్రభుత్వ ప్రతినిధి స్పందిస్తూ.. సీఏఏను ఏ విధంగా అమలు చేయబోతున్నారన్న దానిని నిశితంగా గమనిస్తున్నామని చెప్పారు. మతం ఆధారిత వివక్షను చట్టబద్ధం చేసే సీఏఏను ఒక చట్టంగా తీసుకురావటం సరైనది కాదని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ అభిప్రాయపడింది. మరోవైపు, సీఏఏపై అఫ్గానిస్థాన్‌లోని తాలిబన్ ప్రభుత్వం తొలిసారిగా స్పందిస్తూ.. చట్టం అందరికీ సమానంగా వర్తించాలని, సీఏఏ పరిధిలోకి ముస్లింలను కూడా తీసుకురావాలని పేర్కొంది. తమ దేశంలో హిందువులు, సిక్కుల వంటి మత మైనారిటీలపై ఎటువంటి వివక్ష, వేధింపులు లేవని తెలిపింది.

సీఏఏపై వెనక్కి తగ్గేది లేదు

» అమిత్‌షా వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 14: పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) వెనక్కి తీసుకునే ప్రసక్తి లేదని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అన్నారు. సీఏఏను రాజ్యాంగ విరుద్ధం అంటూ విపక్షాలు చేస్తున్న వాదనలను ఆయన కొట్టివేశారు. ప్రజలను విపక్షాలు భయపెడుతున్నట్టు సీఏఏ నిబంధనల్లో నిర్బంధ శిబిరాల ప్రస్తావన ఎక్కడా లేదని గురువారం ‘ఏఎన్ఐ’కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు. విపక్షాలు పదేపదే ప్రస్తావించే ఆర్టికల్ 14కు భిన్నంగా సీఏఏ నిబంధనలను రూపొందలేదని పేర్కొన్నారు. “అధికారంలోకి వస్తే సీఏఏను రద్దు చేస్తామని అంటున్న ‘ఇండియా’ కూటమికి తాను అధికారంలోకి రాబోవడం లేదని స్పష్టంగా తెలుసు. సీఏఏను మోదీ ప్రభుత్వం తెచ్చింది. దానిని రద్దు చేయడం అసాధ్యం. ఎందుకంటే ఇది పూర్తిగా రాజ్యాంగ సహిత చట్టం. అందువల్లే సుప్రీంకోర్టు దీనిపై స్టే విధించలేదు” అని అమిత్‌షా పేర్కొన్నారు. సీఏఏను ముస్లిం వ్యతిరేక చట్టంగా ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ ఆక్షేపించడంపై స్పందిస్తూ... “అతని తర్కం ఏమిటి? పాకిస్థాన్, అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్ ఇస్లామిక్ దేశాలు. అక్కడ ముస్లింలపై వివక్షకు తావు లేదు. అందువల్లే ముస్లింలను సీఏఏ జాబితాలో చేర్చలేదు” అని తెలిపారు.

వర్సిటీల్లో అంబుడ్స్ పర్సన్లు ఎక్కడ?

» 228 విశ్వవిద్యాలయాలు ఇంకా నియమించలేదు

» జాబితాను విడుదల చేసిన యూజీసీ

» తెలుగు రాష్ట్రాల్లో ఆరు విశ్వవిద్యాలయాలు

న్యూఢిల్లీ, మార్చి 14: ర్యాగింగ్ వంటి అంశాలు, విద్యార్థుల సమస్యలపై అంబుడ్స్‌పర్సన్లను నియమించాలని పదేపదే చెబుతున్నా.. పలు విశ్వవిద్యాలయాలు పట్టించుకోవడం లేదని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) పేర్కొంది. దేశవ్యాప్తంగా ఇంకా 228 వర్సిటీలు అంబుడ్స్‌పర్సన్లను నియమించాలని పేర్కొంటూ.. బుధవారం ఆ జాబితాను విడుదల చేసింది. ఈ లిస్టులో 67 ప్రైవేటు, 159 రాష్ట్ర ప్రభుత్వ, రెండు డీమ్డ్ యూనివర్సిటీలున్నాయి. గత ఏడాది ఆగస్టులో జాదవ్‌పూర్ వర్సిటీలో ర్యాగింగ్, లైంగిక వేధింపుల కారణంగా ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడ్డారు. నవంబరులోనూ ర్యాగింగ్, వేధింపులు ఓ పీజీ విద్యార్థి బలవన్మరణానికి కారణమయ్యాయి. దీంతో వర్సిటీలు అంబుడ్స్‌పర్సన్లను నియమించుకోవాలంటూ యూజీసీ గెజిట్ జారీ చేసింది. జనవరి 17న సుమారు 421 వర్సిటీలు ఆ దిశలో చర్యలు తీసుకోలేదంటూ మందలించింది. తాజాగా ఇంకా 228 వర్సిటీలు అంబుడ్స్‌పర్సన్లను నియమించాల్సి ఉందని పేర్కొంటూ బుధవారం మరో జాబితాను విడుదల చేసింది. వెంటనే అంబుడ్స్‌పర్సన్లను నియమించుకుని, ఆ వివరాలను ఈమెయిల్ ద్వారా తెలియజేయాలని ఆదేశించింది. ఈ చిట్టాలో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆరు విశ్వవిద్యాలయాలున్నాయి. వీటిల్లో.. తెలంగాణకు చెందిన కాళోజీ వైద్య విశ్వవిద్యాలయం, నిమ్స్, ఆర్జీయూకేటీ(బాసర), ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీ, క్లస్టర్ వర్సిటీ, శ్రీవేంకటేశ్వర వేదిక్ విశ్వవిద్యాలయం ఉన్నాయి.



మమతా బెనర్జీకి తీవ్ర గాయం

» ఇంట్లో పడిపోవడంతో నుదుటిపై చిట్లి రక్తస్రావం

కోల్‌కతా, మార్చి 14: పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ గురువారం సాయంత్రం తన నివాసంలో పడిపోవడంతో ఆమెకు నుదుటిపై తీవ్ర గాయమైంది. ఆమెను వెంటనే ప్రభుత్వ ఎస్ఎస్‌కేఎం ఆస్పత్రికి తరలించారు. సీనియర్ వైద్యుల బృందం ఆమెకు చికిత్స అందిస్తోంది. కుట్లు వేయాల్సి ఉంటుందని వైద్యులు చెప్పినట్టు ఆమె సోదరుడు కార్తీక్ బెనర్జీ తెలిపారు. నుదుటిపై గాయం నుంచి రక్తం కారుతున్న మమత ఫొటోను తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) సోషల్ మీడియాలో పోస్టు చేసింది. తమ చైర్‌పర్సన్‌కు తీవ్ర గాయమైందని, ఆమె త్వరగా కోలుకోవాలని ప్రార్థించాలని కోరింది. ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేసి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారని టీఎంసీ సీనియర్ నేత సుఖేందు శేఖర్ రే తెలిపారు. టీడీపీ చీఫ్ చంద్రబాబు, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ తదితరులు మమతా బెనర్జీ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

సాగర్ మరమ్మతు పనులను అడ్డుకోవద్దు

» కృష్ణాబోర్డు, సీఆర్‌పీఎఫ్‌కు ఎన్డీఎస్ఏ ఆదేశం

» డ్యాం రిపేరుపై తెలుగు రాష్ట్రాలకు సూచనలు

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు రక్షణ అంశంతో ముడిపడి ఉన్న పనులు, అత్యవసరంగా చేపట్టే ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓ అండ్‌ఎం) పనులను ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకోవద్దని కృష్ణాబోర్డు, సీఆర్‌పీఎఫ్ బలగాలను నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్ఏ) ఆదేశించింది. సాగర్ రక్షణను పరిశీలించడానికి వీలుగా కేంద్ర జలశక్తిశాఖ ఎన్డీఎస్ఏ కమిటీని వేయగా.. ఆ కమిటీ ఫిబ్రవరి 13న డ్యామ్‌ను పరిశీలించింది. కట్టను పరిశీలించే క్రమంలో ప్రధానంగా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న ఓ అండ్ ఎం పనులకు అడ్డంకులు ఏర్పడుతున్నట్లు గుర్తించింది. ఈ మరమ్మతులను అడ్డుకోవద్దని కృష్ణా బోర్డుతో పాటు సీఆర్‌పీఎఫ్ బలగాలకు స్పష్టం చేసింది. వానాకాలంలోపే, ప్రాజెక్టుకు వరద వచ్చి చేరేలోపే ఓ అండ్ ఎం పనులన్నీ పూర్తిచేయాలని నిర్దేశించింది. గేట్లను ఎత్తడానికి వీలుగా ఉన్న గ్యాంట్రీ క్రేన్ రైల్ ట్రాక్ దెబ్బతిన్నట్లు గుర్తించిన ఎన్డీఎస్ఏ.. సత్వరం దాని పనులు పూర్తిచేయాలని స్పష్టం చేసింది. డ్యామ్ కట్ట భాగం. కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాలతో పాటు పలు భాగాలను ఎన్డీఎస్ఏ పరిశీలించింది. నివేదికను గురువారం తెలుగు రాష్ట్రాలకు పంపించింది.

డ్యామ్ సేఫ్టీ కమిటీ సిఫారసులు..

- కౌంటర్ వెయిట్‌ల వద్ద పిల్లర్లలో కొన్ని పగుళ్లు ఉన్నాయి. అన్ని పిల్లర్లను సమగ్రంగా పరిశీలించాలి. స్పిల్‌వే(నీరు జారే ప్రాంతం)లో రంధ్రాలు ఉన్నాయి. వాటిని కాంక్రీట్‌తో నింపాలి. స్పిల్‌వే దిగువ భాగంలో రాళ్లు బయటికి తేలి కనిపిస్తున్నాయి. ఆ రాళ్లను సరిచేసి, మరమ్మతులు చేయాలి. స్పిల్‌వే నుంచి నీరు జారి కింద పడే ప్రదేశం(ఫ్లిప్ బకెట్)లో భారీగా గుంతలు ఉన్నాయి. వాటికి వానాకాలంలోపే మరమ్మతులు చేయాలి. కుడి, ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రాల్లో భారీగా ఉన్న సీపేజీ నివారణకు చర్యలు తీసుకోవాలి. కట్ట, కాలువల్లో గడ్డితో పాటు ఇతర వ్యర్థాలను తొలగించాలి. ఇంకా పలు సిఫారసులు చేసింది.

మాజీ మంత్రి ప్రత్తిపాటిపై జీఎస్టీ కేసు..

» కౌంటర్ దాఖలుకు సమయం కోరిన సీఐడీ

» అంతవరకు పిటిషనర్లను అరెస్ట్ చేయబోమని హామీ

అమరావతి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ ఎగవేత, బోగస్ ఇన్వాయిస్‌లతో నిధులు మళ్లించారని ఆరోపిస్తూ నమోదు చేసిన కేసులో మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, ఆయన సతీమణి వెంకాయమ్మ, కుమార్తె స్వాతి, కుర్రా జోగేశ్వరరావు, బొగ్గవరపు అంకమ్మరావు, బొగ్గవరపు నాగమణి, బీఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్ ఇండియా ఎండి బలుసు శ్రీనివాసరావు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లపై సవివరంగా కౌంటర్ దాఖలు చేస్తామని సీఐడీ తరఫున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ వైఎల్ శివకల్పనారెడ్డి గురువారం హైకోర్టుకు వివరించారు. విచారణను ఈ నెల 22కు వాయిదా వేయాలని కోరారు. పిటిషనర్ల అరెస్ట్ చేయబోమని గతంలో ఇచ్చిన హామీని తదుపరి విచారణ వరకు పొడిగించవచ్చన్నారు. న్యాయమూర్తి స్పందిస్తూ.. కౌంటర్ దాఖలు చేసేందుకు సీఐడీకి సమయం ఇస్తూ విచారణను ఈనెల 22కి వాయిదా వేశారు. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు గురువారం ఆదేశాలిచ్చారు. గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించారు.

ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఏ దశలో ఉంది?



» భూములేమైనా విక్రయించారా?

» వివరాలను కోర్టు ముందుంచండి

» ఆర్ఐఎన్ఎల్ సీఎండీకి హైకోర్టు ఆదేశం

» పరిశ్రమను కొనుగోలు చేస్తారా?

» రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ధర్మాసనం

» భూములు అమ్మలేదు.. కౌంటర్ వేస్తాం: కేంద్రం

అమరావతి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ‘విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ ఏ దశలో ఉంది?. స్టీల్ ప్లాంట్‌కు చెందిన భూములు ఏమైనా విక్రయించారా? పరాధీనం చేశారా? విక్రయిస్తే ఇప్పటివరకు ఎన్ని ఎకరాలు విక్రయించారు? తదితర వివరాలను కోర్టు ముందు ఉంచండి’ అని రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్(సీఎండీ)ని హైకోర్టు ఆదేశించింది. మరోవైపు ప్లాంట్‌ను కొనుగోలు చేసే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వానికి ఏమైనా ఉందా? అని ఏజీని ఆరా తీసింది. కర్మాగారానికి చెందిన భూములను ఇప్పటికే విక్రయించారని ఆరోపిస్తున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఆధారాలను కోర్టు ముందుంచాలని పిటిషనర్‌ను ఆదేశించింది. కేసుకి సంబంధించిన వివరాలు తప్ప ఇతర విషయాలు ప్రస్తావించవద్దని పిటిషనర్ కేఏ పాల్‌ను హెచ్చరించింది. కౌంటర్ దాఖలు చేయాలని కేంద్రాన్ని ఆదేశిస్తూ విచారణను ఈ నెల 22కి వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జి.నరేందర్, జస్టిస్ న్యాపతి విజయ్‌తో కూడిన ధర్మాసనం గురువారం ఆదేశాలిచ్చింది. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిమిత్తం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్, విశ్రాంత ఐపీఎస్ అధికారి వాసగిరి లక్ష్మీనారాయణ వేర్వేరుగా హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు (పిల్) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలు బుధవారం హైకోర్టులో విచారణకురాగా పార్టీ ఇన్ పర్సన్‌గా కేఏ పాల్ స్వయంగా వాదనలు వినిపించారు. ప్లాంట్‌ను ప్రైవేటీకరించకుండా నిలువరించాలని కోరారు. ఇప్పటికే ప్లాంట్‌కు చెందిన వేల ఎకరాలను అమ్మేశారన్నారు. కేవలం 16వేల ఎకరాలు మాత్రమే మిగిలాయన్నారు. స్టీల్ ప్లాంట్ నష్టాలలో ఉందా? లేదా? అనే విషయాన్ని తేల్చేందుకు విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో కమిటీని వేయాలని కోరారు. ఎఫ్‌సీఆర్ఏ (ఫారెన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్) కింద ప్రత్యేక ఖాతాకు కేంద్రం అనుమతిస్తే సొమ్మును అందులో జమ చేస్తామన్నారు. స్టీల్ ప్లాంట్‌కు చెందిన ఆస్తులు విక్రయించకుండా స్టే విధించాలని కోరారు. అడ్వకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.... స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. పరిశ్రమను నష్టాల నుంచి బయటపడేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయాలు సూచించిందన్నారు. ప్లాంట్ ఏర్పాటుకు భూములు ఇచ్చిన వారికి నష్టం జరగకూడదన్నదే తమ అభిప్రాయమన్నారు. పరిశ్రమ విక్రయం చివరి ఆప్షన్‌గా ఉండాలన్నారు. ధర్మాసనం కలగజేసుకుంటూ స్టీల్ ప్లాంట్‌ను కొనుగోలు చేసే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వానికి ఏమైనా ఉందా? అని ఏజీని ఆరా తీసింది. ఏజీ సమాధానం ఇస్తూ ఈ వ్యవహారంపై ప్రభుత్వం నుంచి వివరాలు తెప్పించుకోవాల్సి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... స్టీల్ ప్లాంట్‌కు సంబంధించిన భూములు విక్రయించామన్న పిటిషనర్ ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. కౌంటర్ వేసేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు.

లిఫ్ట్ ఇస్తామని కారు ఎక్కించుకుని దారిదోపిడీ

» ఏపీకి చెందిన దంపతులు నల్లగొండ జిల్లాలో అరెస్టు

నల్లగొండ టౌన్, మార్చి 14: లిఫ్ట్ ఇస్తామంటూ ఒంటరి ప్రయాణికులను నమ్మించి కారులో ఎక్కించుకుని దారిదోపిడీకి పాల్పడిన ఏపీకి చెందిన దంపతులను నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. నల్లగొండ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఈ కేసు వివరాలను డీఎస్పీ కె.శివరాంరెడ్డి వెల్లడించారు. ఏపీలోని పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన చిమట గోపీకృష్ణ తన మొదటి భార్యతో గొడవ పెట్టుకుని ఒంటరిగా ఉండేవాడు. కారు డ్రైవర్ అయిన అతడు సత్తెనపల్లికే చెందిన వితంతువు చింత మహేశ్వరిని ఏడాది క్రితం వివాహం చేసుకున్నాడు. గోపీకృష్ణ, మహేశ్వరి దంపతులు తమ సంపాదన సరిపోకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా ఒంటరిగా ప్రయాణం చేసే వారిని లిఫ్ట్ పేరుతో నమ్మించి కారులో ఎక్కించుకుని దారిలో వారిని దోచుకోవాలని పథకం వేసుకున్నారు. ఈక్రమంలో హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో నివాసముండే దుగ్గి కృష్ణారావు తన స్వస్థలం సత్తెనపల్లి మండలం బూరుగుపాడుకు ఈనెల 10న వచ్చి అదేరోజు రాత్రి తిరుగుప్రయాణం అయ్యాడు. ఈ క్రమంలో పిడుగురాళ్ల నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు బస్సు కోసం ఎదురుచూస్తుండగా గమనించిన గోపీకృష్ణ దంపతులు.. అద్దె కారులో కృష్ణారావు వద్దకు వెళ్లి తామూ హైదరాబాద్ వెళుతున్నామని, లిఫ్ట్ ఇస్తామని నమ్మించి వాహనంలో ఎక్కించుకున్నారు. కారు నల్లగొండకు చేరుకోగానే దేవరకొండ రోడ్డులోని కొత్తపల్లి గ్రామ శివారుకు తీసుకెళ్లి ఆపారు. వెంటనే తమ వద్ద ఉన్న కత్తులను బయటకు తీసి కృష్ణారావును చంపేస్తామని బెదిరించి.. అతని వద్ద ఉన్న 15 గ్రాముల బంగారు గొలుసు తీసుకుని పరారయ్యారు. ఈ చోరీపై కృష్ణారావు 11వ తేదీన నల్లగొండ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా కారును గుర్తించారు. మర్రిగూడ బైపాస్‌లో బుధవారం సాయంత్రం వాహన తనిఖీలు చేపట్టి నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి కారు, 15గ్రాముల బంగారు గొలుసు, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నారు.

స్క్రాప్ విక్రయంతో రైల్వేకు 411 కోట్ల ఆదాయం

హైదరాబాద్/జహీరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2023-24లో స్క్రాప్ విక్రయంతో రూ.411.39 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకుంది. నిరుపయోగ తుక్కు అమ్మకంలో రైల్వే బోర్డు నిర్దేశించిన లక్ష్యాన్ని జోన్ అధిగమించిందని రైల్వే అధికారులు తెలిపారు. గత ఏడాది 2022-23లో స్క్రాప్ అమ్మకం ద్వారా రూ.391 కోట్ల ఆదాయం లభించినట్టు పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో ఇ-వేలం ద్వారా అమ్మకాలను చేపట్టినట్టు వివరించారు.‘మిషన్ జీరో స్క్రాప్’ ప్రాజెక్ట్ లక్ష్యానికి అనుగుణంగా దక్షిణ మధ్య రైల్వే మెటీరియల్స్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ఎప్పటికప్పుడు నిరుపయోగ వస్తువులను గుర్తించి ఎంపిక చేసిన ప్రాంతాలకు తరలిస్తున్నట్టు అధికారులు తెలిపారు. దీంతో వర్క్‌షాప్‌లు, వివిధ రైల్వే యూనిట్ల ప్రాంగణాలను శుభ్రంగా ఉంచడంతో పాటు స్క్రాప్ సామగ్రి అమ్మకం ద్వారా రైల్వే ఆదాయం సమకూరుతోందని పేర్కొన్నారు.

రైల్వే స్టేషన్లకు కొత్త కళ: రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్

అమృత్‌భారత్ స్టేషన్ల అభివృద్ధిలో భాగంగా దేశవ్యాప్తంగా రైల్వేస్టేషన్లకు కొత్త కళ సంతరించుకోనున్నదని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ చెప్పారు. గురువారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని రైల్వేస్టేషన్‌ను సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఇక్కడి పనులపై అయన సంతృప్తి వ్యక్తం చేశారు. జహీరాబాద్ ప్రాంతంలో రైల్వేశాఖ పరంగా తీర్చాల్సిన సమస్యలపై దక్షిణ మధ్య రైల్వేబోర్డు సభ్యుడు షేక్‌ఫరీద్ ఈ సందర్భంగా జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు వినతిపత్రం అందించారు.

దక్షిణ మధ్య రైల్వే రక్షణ దళానికి ‘శక్తి టీం’ పురస్కారం

అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం దక్షిణ మధ్య రైల్వే మహిళా రైల్వే రక్షణ దళానికి ‘మహిళల రక్షణ కేటగిరి’ కింద ‘శక్తి టీం’ పురస్కారాన్ని అందించింది. గురువారం రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో మంత్రి సీతక్క.. దక్షిణ మధ్య రైల్వే ఐజి కమ్ ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమా సింగ్ ఠాకూర్‌కు రూ.1 లక్ష నగదు, జ్ఞాపికను అందించి సత్కరించినట్టు రైల్వే అధికారులు తెలిపారు. ఈ సంధర్బంగా దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్.. అరోమా సింగ్ ఠాకూర్‌ను అభినందించారు.

నారాయణ విషయంలో 41ఏ నిబంధనలు పాటిస్తాం

హైకోర్టుకు నివేదించిన పోలీసులు


అమరావతి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పొంగూరి కృష్ణప్రియ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదు చేసిన కేసులో మాజీ మంత్రి నారాయణ విషయంలో సీఆర్పీసీ సెక్షన్ 41(ఏ) నిబంధనలు పాటిస్తామని పోలీసులు హైకోర్టుకు నివేదించారు. ఈ వివరాలు నమోదు చేసిన న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు వ్యాజ్యంపై విచారణను ముగిసివేశారు. తనను వేధింపులకు గురిచేస్తున్నారంటూ మాజీ మంత్రి నారాయణ మరదలు పొంగూరి కృష్ణప్రియ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నెల్లూరు పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ నారాయణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు వచ్చింది. నోటీసులు ఇచ్చేందుకు పిటిషనర్ పోలీసులకు అందుబాటులో లేరని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టుకు నివేదించడంతో.. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపిస్తూ... పిటిషనర్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని, ఎన్నికల ప్రచారం కూడా నిర్వహిస్తున్నారని.. ఆయన అందుబాటులో లేరని పోలీసులు అసత్యాలు చెబుతున్నారని అన్నారు.

పునీత్ విషయంలో తొందరపాటు చర్యలు వద్దు

మరోవైపు పొంగూరి కృష్ణప్రియ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ నారాయణ అల్లుడు పునీత్ దాఖలు చేసిన పిటిషన్ గురువారం హైకోర్టులో విచారణకు వచ్చింది. పునీత్ విషయంలో ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి వాయిదా వేశారు.

ప్రత్తిపాటి శరత్‌కు బెయిల్ మంజూరు

విజయవాడ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ ఎగవేత కేసులో అరెస్టయిన మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు శరత్‌కు విజయవాడ మొదటి అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ కోర్టు గురువారం బెయిల్ మంజూరు చేసింది. రిమాండ్ గడువు ముగియంతో శరత్‌ను ఉదయం కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌ను పొడిగించారు. బెయిల్ పిటిషన్‌పై మధ్యాహ్నం తీర్పు వెలువరించారు. రూ.25 వేల పూచీకత్తు, ఇద్దరు జామీనుతో శరత్‌కు బెయిల్ మంజూరు చేశారు. దీంతో శరత్ జైలు నుంచి విడుదలయ్యారు.



ఒంటిపై పది కిలోల బంగారంతో శ్రీవారి దర్శనానికి వచ్చిన బంగారు బాబు అందరినీ ఆకట్టుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త, హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్ (బంగారు బాబు) గురువారం శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనను భక్తులు ఆసక్తిగా చూశారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి